## పకృతి వ్యవసాయ డీపీఎంగా పూజారి సత్యన్నారాయణ

**విశాలాంధ్ర - శ్రీకాకుళం టౌన్ :** పకృతి వ్యవసాయ జిల్లా ప్రాజెక్ట్ మేనేజర్ గా పూజారి సత్యన్నారాయణ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయాన్ని ముందుకు వెళ్లే ప్రక్రియ లో తాను కృషి చేస్తానని, జిల్లాలో రైతులకు పకృతి వ్యవసాయం మీద మరింత అవగాహన పెంచి జిల్లాలో పకృతి వ్యవసాయ సాగు విస్తరణకు కృషి చేస్తానన్నారు.

# ఏఐవైఎఫ్ జాతీయ మహాసభలు జయప్రదం చేయండి

## ఏఐవైఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు మొజ్జాడ యుగంధర్

**విశాలాంధ్ర - శ్రీకాకుళం టౌన్ :** మే 15వ తేదీ నుంచి 18వ తేదీ వరకు తిరుపతి నగరంలో జరిగే ఏఐవైఎఫ్ 17వ జాతీయ మహా సభలను జయప్రదం చేయాలని ఏఐవైఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు మొజ్జాడ యుగంధర్ పిలుపునిచ్చారు. స్థానిక కా. ఎన్ఆర్ దాసరి క్రాంతిభవన్ లో జాతీయ మహాసభలకు సంబంధించి గోడ పత్రికను శుక్రవారం ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ దేశ నలుమూలల నుండి జాతీయ మహాసభలో యువత పాల్గొంటారని, 29 రాష్ట్రాల నుండి జాతీయ మహా సభలకు ప్రతినిధులుగా హాజరవుతారన్నారు. మే 15వ తేదీ వేలాది మంది యువతతో ర్యాలీ, బహిరంగ సభ ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు. మే 16వ తేదీ నుండి 18వ తేదీ వరకు ప్రతినిధుల సభ నిర్వహించడం జరుగుతుందన్నారు. ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్ష కార్య దర్శులు బొత్స సంతోష్, కొన్న శ్రీనివాస్‌లు మాట్లాడుతూ ప్రతి సంవత్సరం రెండు కోట్ల ఉద్యోగాలు భర్తీ చేస్తానన్న ప్రధానమంత్రి నరేంద్ర మోడీ తన మాటను గాలికొదిలేశారన్నారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు నిరుద్యోగ సమస్య ను పరిష్కారం చేయడంలో విఫలమయ్యారని దుయ్యబట్టారు. ప్రభుత్వ రంగ సంస్థలను కారు చౌకగా ప్రైవేటు పరం చేస్తూ కార్పొరేట్ శక్తులకు కట్ట బెడుతున్నారన్నారు. భగత్ సింగ్ నేషనల్ ఎంప్లాయిమెంట్ గ్యారెంటీ యాక్ట్ ద్వారా దేశంలో యువతకు ఉద్యోగ ఉపాధి అవకాశాలు కల్పించాలని కోరారు. యువజన హక్కుల సాధనకై ప్రభుత్వ శాఖలలో ఖాళీగా ఉన్న పోస్టులను భర్తీ చేసే దిశగా ప్రభుత్వాలు పనిచేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఏఐవైఎఫ్ నాయకులు అరవింద్, వాసు, క్రాంతి, హరి తదితరులు పాల్గొన్నారు.

# సకాలంలో మెరుగైన వైద్యం అందించాలి : కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

**విశాలాంధ్ర - శ్రీకాకుళం టౌన్ :** వైద్యం నిమిత్తం రిమ్స్‌కు వచ్చే వారికి సకాలంలో లో మెరుగైన వైద్యం అందించాలని రిమ్స్ సిబ్బంది కి కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ ఆదేశించారు. ఆసుపత్రిలో ఉన్న చిన్న చిన్న సమస్యలు పరిష్కారం అయ్యాయని జిల్లా కలెక్టర్ వెల్లడించారు. శుక్రవారం ప్రభుత్వ సర్వజన ఆసుపత్రిని ఆయన సందర్శించి సమీక్షించారు. సందర్శన అనంతరం వైద్యులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత కొన్ని రోజులుగా ఆసుపత్రి లో చిన్న చిన్న సమస్యలపై ఫిర్యాదులు అందాయని, ఆ సమస్యలు పరిశీలనకు సందర్శించగా ఆ సమస్యలు ప్రస్తుతం పరిష్కారం అయినట్లు చెప్పారు. కొన్ని మందులు అందుబాటులో లేవని ఫిర్యాదులు రాగా మందులు అన్ని అందు బాటులో ఉన్నట్లు స్పష్టం చేశారు. ఆసుపత్రిలో ఖాళీలు ఉండగా తన పరిధిలో ఉన్న వాటిని వారం రోజుల్లో భర్తీ చేస్తామన్నారు. జిల్లాలో జిజిహెచ్ కు వైద్యం నిమిత్తం జిల్లాలోని వివిధ ప్రాంతాల్లో ఉన్న ప్రజలు వస్తుంటారని చెప్పారు. వైద్యం నిమిత్తం ప్రభుత్వ సర్వజన ఆసుపత్రికి వచ్చిన టెక్కలి ప్రాంతానికి చెందిన పోలా

భాస్కరరావు అనే వ్యక్తిని కలెక్టర్ అడుగగా ఊరిలో పడిపోయానని, టెక్కలి హాస్పిటల్ నుండి శ్రీకాకుళం ప్రభుత్వ ఆసుపత్రి వచ్చినట్లు చెప్పారు. వచ్చిన తర్వాత ఇక్కడే రెండు శస్త్రచికిత్సలు చేసినట్లు కలెక్టర్ కు వివరించారు. శస్త్ర చికిత్సలు బాగా చేశారా లేదా అని పేషెంట్ ను అడగగా బాగా చేసి చూసుకున్నట్లు తెలిపారు. ఆర్థోపెడిక్ విభాగంలోని పేషెంట్స్ తో మాట్లాడి వారిలో ఆత్మస్థైర్యం నింపారు. మరుగుదొడ్లు పరిశీలించి పలు సూచనలు జారీ చేశారు. రన్నింగ్ వాటర్ వస్తున్నది లేనిది పరిశీలించారు. కాంట్రాక్టు బేసిస్ సిబ్బంది గూర్చి ఆరా తీశారు. ఓపి రిజిస్ట్రేషన్ ను సందర్శించి ఒక ఓపికి ఎంత సమయం పడుతుందని వివరాలు అడిగి తెలుసుకున్నారు. సమస్యలు ఏమైనా ఉన్నాయా అని కలెక్టర్ అడుగగా ఆర్థోలో మేల్, ఫిమేల్ వార్డులో పార్టీషన్ ఏర్పాటు చేయాలని చెప్పగా పార్టీషన్ ఏర్పాటు చేయాలి సూపరింటెండెంట్ ను ఆదేశించారు. వాటర్ అదనంగా అవసరం అవుతుందని సూపరింటెండెంట్ చెప్పగా ఒక బోర్ తీయించాలని ఎపిఎంఎస్ఐసిడి ఈఈని ఆదేశించారు. పేషెంట్లకు భోజనాలు సరఫరా చేసే స్థలం, తదితర వాటిపై చర్చించారు. ఎంఆర్ స్కానింగ్ వద్ద వాటర్ వస్తోందని చెప్పగా గ్రౌండ్ వాటర్ డిడిని పరిశీలించి రిపోర్ట్ అందజేయమని ఆదేశించారు. టెక్కలి నుండి వచ్చే రిఫరల్, నేరుగా వచ్చే పేషెంట్స్ జాబితా అందజేయాలని ఆర్ఎంఓ ను ఆదేశించారు. సదరం కేంద్రాన్ని సందర్శించి సర్టిఫికెట్లు పరిశీలనకు వచ్చే వారి వివరాలు అడిగి తెలు సుకొని ఒక్కొక్కరిని ఏ విధంగా పంపిస్తున్నారని అడిగి తెలుసుకున్నారు. వచ్చే వారికి తాగునీరు ఏర్పాటు ఏర్పాటు చెయ్యలన్నారు. పలు సమస్యలపై చర్చించి సూచనలు జారీ చేశారు. ఈ సందర్శనలో సియస్ ఆర్ఎంఓ డాక్టర్ అనిత, డిసియస్ ఆర్ఓ డాక్టర్ సుభాషిని, సూపరింటెండెంట్ డాక్టర్ షకీలా, డాక్టర్ శ్రీదేవి, రిమ్స్ ప్రిన్సిపాల్ డాక్టర్ వెంకటచలం, డిప్యూటి సూపరింటెండెంట్ డాక్టర్ షర్మిల, డాక్టర్ భాను ప్రకాష్ పాల్గొన్నారు.

## డీజీపురం రోడ్డుకు మంచి రోజులు

**విశాలాంధ్ర - సోంపేట/కంచిలి :** కంచిలి మండలం బైరిపురం జంక్షన్ నుంచి డీజీపురం వెళ్లే ఎంతో ప్రాధాన్యత గల రహదారికి త్వరలో మంచి రోజులు రానున్నాయి. ఇప్పటికే ఈ రోడ్డు అభివృద్ధికి కేంద్ర మంత్రి రామ్మోహన్‌నాయుడు కృషితో పెద్ద మొత్తంలో నిధులు మంజూరైన విషయం తెల్సిందే. ఈ రహ దారిలో డీజీపురం, బైరిపురం మధ్య వంతెన కూలి పోవడంతో ఆ ప్రదేశంలో కొత్త వంతెన నిర్మాణానికి 80 లక్షల రూపాయలు మంజూరైనట్లు టీడీపీ సీనియర్ నేత రాష్ట్ర టీడీపీ ప్రధాన కార్యదర్శి మాదిన రామారావు తెలిపారు. నిధులు మంజూరుకు కృషి చేసిన ప్రభుత్వ విప్, ఇచ్ఛాపురం ఎమ్మెల్యే డాక్టర్ బెందాళం అశోక్‌కు రామారావు కృతజ్ఞతలు తెలిపారు. ఈ మేరకు రామారావు ఆర్‌అండ్‌బి అధికారులు, ఆయా గ్రామాల ప్రతినిధులతో కలిసి వంతెన నిర్మాణ ప్రదేశాన్ని పరిశీలించారు.

## ప్రభుత్వ కార్యాలయాల్లో చలివేంద్రాలు ఏర్పాటు చేయాలి

**విశాలాంధ్ర - నరసన్నపేట :** నియోజక వర్గంలోని ప్రభుత్వ కార్యాలయాల్లో చలి వేంద్రాలు ఏర్పాటు చేయాలని ఎమ్మెల్యే, బగ్గు రమణమూర్తి అన్నారు. శుక్రవారం స్థానిక తహశీల్దార్ కార్యాల యంలో చలి వేంద్రం ఏర్పాటు చేసి, కార్యాల యానికి వచ్చిన ప్రజలకు మంచినీరు అందచేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు వేసవి కాలాన్ని దృష్టిలో పెట్టుకొని, ప్రతీ మండల కార్యాలయాల్లో సంబంధిత మండల శాఖ అధికారులు చలి వేంద్రం ఏర్పాటు చేసి, త్రాగునీటిని కార్యాలయాలకు వచ్చేవారికి అందచే యాలన్నారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్, సత్యన్నారాయణ, రెవెన్యూ సిబ్బంది, టిడిపి నాయకులు, సరిపల్లి మధు తదితరులు పాల్గొన్నారు.

## బహుజనుల ధర్నా విజయవంతం చేయండి

**విశాలాంధ్ర - సోంపేట :** ఈ నెల 11 మహాత్మా జ్యోతిరావు పూలే జయంతి సంద ర్భంగా శ్రీకాకుళం కలక్టరేట్ వద్ద బహుజన సమాజ్ వాది పార్టీ ఆధ్వ ర్యంలో జరుగు మహా ధర్నాను అన్ని వర్గాల ప్రజలు పాల్గొని విజయవంతం చేయాలని పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు వేదవర బిసాయి కోరారు. ఆయన విశా లాంధ్రతో మాట్లాడుతూ బహుజనులైన బీసీలకు 52శాతం రిజర్వేషన్ కల్పించాలని డిమాండ్ చేశారు. ప్రైవేటు రంగం ఉద్యోగాల్లో కూడా రిజర్వేషన్ కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమానికి బీసీలు, ప్రగతివాదులు, ఎస్సీ, ఎస్టీ మైనార్టీలు అధిక సంఖ్యలో పాల్గొని బహు జనుల కలల సాకారం కోసం పోరాడాలని పిలుపు నిచ్చారు. కేంద్రాన్ని పాలిస్తున్న బీజేపీ ఒక మతోన్మాద పార్టీ అని విమర్శించారు. మతం ఆధారంగా పాలనకు ప్రాధాన్యత ఇచ్చి రాబోవు కాలంలో దేశంలో లౌకిక భావన లేకుండా రాజ్యహింస చెలరేగేలా ప్రయత్ని స్తున్నారని అన్నారు. కేంద్ర ప్రభుత్వం ఇప్పటికైనా కుల జనగణన నిర్వహించి తద్వారా రిజర్వేషన్లు కేటాయించాలని తెలిపారు.

## మెరుగైన రవాణా సౌకర్యం కల్పించడమే లక్ష్యం

### రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి మంత్రికింజరాపు అచ్చెన్నాయుడు

**విశాలాంధ్ర - టెక్కలి :** ప్రజలకు మెరుగైన రవాణా సౌకర్యం కల్పించడమే కూటమి ప్రభుత్వం లక్ష్యంని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు అన్నారు. టెక్కలి కేంద్రంలో శుక్రవారం టెక్కలి నుంచి అమలా పురం, శ్రీకాకుళం, విశాఖపట్నం నూతనంగా 4 ఆర్టీసీ బస్సును ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఇచ్చిన మాట ప్రకారం ఒక్కొక్కటిగా సంక్షేమ పథకాలు ప్రజలకు అందిస్తున్నామని చెప్పారు. నూతన బస్సుల ప్రారంభం ద్వారా పట్టణ ప్రజలు, గ్రామీణ ప్రాంతాల ప్రజలు మరింత సురక్షితంగా, సౌకర్యవంతంగా ప్రయాణించగలరని మంత్రి అన్నారు. ఈ బస్సుల ద్వారా ముఖ్యమైన ప్రాంతాలకు మరింత విస్తృతమైన రవాణా సదుపాయాలు అందించడంతో ప్రయాణ ఖర్చును తగ్గించేందుకు ఇది దోహదపడుతుందని మంత్రి వివరించారు. ఈ కార్యక్రమంలో పిఎసిఎస్ మాజీ అధ్యక్షులు కింజరాపు హరివర ప్రసాద్, తెదేపా ముఖ్య నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## అత్యవసర వైద్య సేవలను అందించండి : ఎమ్మెల్యే గౌతు శిరీష

**విశాలాంధ్ర - మందస :** ప్రభుత్వ ఆసుపత్రిలో వైద్యులు అత్యవసర వైద్య సేవలను క్షతగాత్రులకు అందించాలని పలాస ఎమ్మెల్యే గౌతు శిరీష అన్నారు. శుక్రవారం హరిపురం కమ్యూనిటీ హెల్త్ సెంటర్ లో ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గౌతు శిరీష మాట్లాడుతూ, ప్రజలకు మానవ దృక్పథంతో వైద్య సేవలు అందించి ఆసుపత్రికి పేరు ప్రఖ్యాతలు తీసుకురావాలన్నారు. వైద్య అధికారులను ఆసుపత్రిలో సిబ్బంది కొరతపై అడిగి తెలుసుకున్నారు. మాజీ ఆసుపత్రి అభివృద్ధి కమిటీ ఛైర్మన్ పుల్ల.వాసుదేవ్ ఎమ్మెల్యే శిరీష దృష్టికి త్రాగునీటి సమస్య అత్యవసరలలో క్షతగాత్రులకు సేవలు అందించేందుకు నైట్ డ్యూటీ డాక్టర్లను నియమించాలని ఆక్సిజన్ సిలిండర్లు కొరత లేకుండా చూడాలని శానిటైజేషన్ పరిసరాల పరిశుభ్రత ఉంచే విధంగా టీబీ వ్యాధి గుర్తించేందుకు టెక్నీషియన్లు నియమించాలని కోరారు. అనంతరం ఎమ్మెల్యే శిరీష మాట్లాడుతూ ఆసుపత్రి అభివృద్ధికి అన్ని రంగాల్లోనే ప్రాధాన్యత ఇవ్వడం జరుగుతుందన్నారు. వైద్యులను అడిగి ఆసుపత్రికి సంబంధించిన పలు సమస్యలను తెలుసుకున్నారు. ఆసుపత్రి సూపరిండెంట్ డాక్టర్ స్వరాజ్యలక్ష్మి మాట్లాడుతూ వైద్యులు సిబ్బంది అందుబాటులో ఉన్నారని వైద్య సేవలు ప్రజలకు అందించేందుకు అన్ని చర్యలు తీసుకుంటామన్నారు. ఆసుపత్రి నూతన అభివృద్ధి కమిటీ చైర్మన్‌గా గౌతు శిరీష, కమిటీ మెంబర్లు ఎరుపుల.జోగారావు, సాలిన.భీమారావు, మల్లెల సుశీల ఎన్నికయ్యారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ జోగినాయుడు. డాక్టర్ ఐశ్వర్య, డాక్టర్ షణ్ముఖ రాజు డాక్టర్ జ్ఞానేశ్వరి, టీడీపీ నాయకులు భావన.దుర్యోధన, దాసరి.తాతారావు, రట్టి.లింగరాజు, బైరిశెట్టి గున్నయ్య, కొత్ర.ఆనందరావు, నవీన్.యాదవ్, కే.వెంకట్రావు, టి.సోమేష్, కే.తులసి, చౌదరి, మురళీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## రాష్ట్రస్థాయిలో మొదటి స్థానం పొందిన శ్రీవాణి విద్యార్థి

**విశాలాంధ్ర - ఆమదాలవలస :** భారత తపాలా శాఖ జాతీయ స్థాయిలో నిర్వ హించిన లేఖా రచన పోటీల్లో ఆమదాలవలస శ్రీ వాణీ విద్యా నికేతన్ లో 8వ తరగతి చదువు తున్న విద్యార్థిని ఇ. కావ్యశ్రీ కి రాష్ట్ర స్థాయి ప్రథమ బహుమతి లభించింది. ఇటీవల కాలం లో పోస్టల్ డిపార్ట్మెంట్ మూడు విభాగాల్లో టా లెంట్ టెస్ట్‌లు నిర్వహించి విజేతలకు బహుమ తులు అందించారు. పోస్ట్ కార్డ్, ఇన్ ల్యాండ్, ఎన్వలప్ విభాగంలో కావ్య శ్రీ రాష్ట్ర స్థాయిలో నే మొదటి విభాగంలో నిలిచారు. శ్రీ వాణి విద్యనికేతన్ విద్యార్థి ఇ కావ శ్రీ ప్రథమ స్థానా న్ని కైవసం చేసుకుని ఆముదాలవలస, శ్రీకా కుళం జిల్లా కీర్తి పతాకాన్ని రాష్ట్రస్థాయిలో ఎగు రవేసిన కీర్తి కిరీటం అయ్యారు. ఆమె సాధించి న విజయాన్ని స్థానిక పాఠశాలలో బహుమతి తల్లిదండ్రుల సమక్షంలో అందిం చడంతో ఆ నందానికి అవధులు లేవు. శ్రీకాకు ళం హెడ్ పోస్టాఫీసు సూపరింటెండెంట్ వందాన హరి బాబు ఇరవై ఐదు వేల రూపాయల చెక్కు ను పాఠశాల ప్రాంగణంలో అందజేశారు. జాతీయ స్థాయిలో జరిగిన ఈ పోటీలో సుమారు ఎనిమిది వేల మంది ఈ పోటీలో పాల్గొనగా ప్రథమ బహుమతిని శ్రీ వాణీ విద్యా నికేతన్ విద్యార్థిని కైవసం చేసుకోవడం తపాలా శాఖకు జిల్లాకు దక్కిన గౌరవమని సూపరింటెండెంట్ అభినందించారు. కావ్య శ్రీ తల్లిదండ్రులు, విద్యార్థుల సమక్షంలో ఈ విశిష్ట బహుమతిని అందుకో వడం ఆనందంగా ఉందని విజేత కావ్య శ్రీ తన స్పందనను తెలిపింది. విద్యార్థినికి తర్ఫీదు ఇచ్చిన విశ్రాంత తెలుగు ఉపాధ్యాయులు కె.వి.రాజారావును పాఠశాల డైరెక్టర్ బి.వెంక టేశ్వర్లు, బి.నారాయణ మూర్తి, విశ్రాంత మండల విద్యా శాఖాధికారి యస్.వి.రమణ అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు సంపత్, ప్రణవి, తరుణ్, హరిబాబు, అప్పలనాయుడు, పోస్టల్ శాఖలో స్టెనో పూజారి దివాకర్ తదితరులు పాల్గొ న్నారు.

## విద్యాభివృద్ధికి కూటమి ప్రభుత్వం కృషి : బగ్గు రమణమూర్తి

**విశాలాంధ్ర - నరసన్నపేట :** రాష్ట్రంలో విద్యా భివృద్ధికి కూటమి ప్రభుత్వం కృషి చేస్తుందని, దీనిలో భాగంగా విద్యార్థులకు సంపూర్ణమైన విద్యను అందిం చేందుకు అన్ని విధాల ప్రణాళికలు సిద్ధం చేస్తుందని ఎమ్మెల్యే, బగ్గు రమణమూర్తి అన్నారు. శుక్రవారం స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో సర్వేపల్లి రాధాకృష్ణన్ విద్యార్థి మిత్ర కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఇంటర్మీడియట్ విద్యార్థులకు ఎమ్మెల్యే, రమణమూర్తి ఉచితంగా పాఠ్య పుస్తకాలు పంపిణీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఇప్పటికే ప్రభుత్వ పాఠశాలలతో పాటు ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో ఉచిత మధ్యాహ్న భోజన పథకాన్ని కొనసాగిస్తున్నామని తెలిపారు. విద్యార్థులకు ప్రాథమిక స్థాయి నుండే ఉన్నతమైన భవిష్యత్తును అందిపుచ్చుకునే అన్ని విధాల ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని అన్నారు. ఈ కార్యక్రమంలో కళింగ కార్పొరేషన్ రాష్ట్ర ఛైర్మన్, రోణంకి కృష్ణంనాయుడు, టిడిపి నాయకులు, గొద్దు చిట్టిబాబు, వూణ్ణ వేంకటేశ్వరరావు, జామి వెంకటరావు, బోయిన ఆనంద్‌రావు, బతకల సంతోషి, పుచ్చుల కల్పన, బతకల గోపి, కళాశాల ప్రిన్సిపాల్, ఎం.సతీష్, అధ్యాపక సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

## పొగాకు రహిత విద్యాసంస్థలే ధ్యేయం కావాలి

**విశాలాంధ్ర - కవిటి :** పొగాకు రహిత విద్యాసంస్థలే ఉపాధ్యాయుల ధ్యేయం కావాలని హెచ్ఎం పి.జ్యోతి అన్నారు. ఈ మేరకు శుక్రవారం కవిటి మండలంలో గల మడియా పుట్టుగ ప్రాథమిక పాఠశాలలో పొగాకు రహిత విద్యా సంస్థల పేరిట కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతీ పాఠశా లలో గోడల పైన నోటీస్ బోర్డుల్లో పొగాకు రహిత నినాదాలు, చిత్రాలు ఏర్పాటు చేయాలని సూచించారు.

## అవకతవకలను ఉపేక్షించేది లేదు

**విశాలాంధ్ర - కవిటి :** ప్రజా పంపిణీ వ్యవస్థ ద్వారా నిరుపేదలకు ప్రభుత్వం అంద జేస్తున్న బియ్యం పంపిణీలో అవక తవ కలు జరిగితే ఉపే క్షించేది లేదని జిల్లా జనసేన పార్టీ ప్రధాన కార్యదర్శి, కలింగ కార్పొరేషన్ డైరెక్టర్ లోళ్ల రాజేష్ అన్నారు. ఈ మేరకు శుక్రవారం కవిటి మండల కేంద్రంలో రేషన్ బియ్యం సరఫరా చేస్తున్న ఎండీయూ వాహనాలను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేపట్టారు. అందులో బియ్యంను తనిఖీ చేసి లబ్దిదారుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఎక్కడైన ఇబ్బందులు జరిగితే నేరుగా తమ దృష్టికి తీసుకురావాలని లబ్దిదారులకు సూచించారు.

## ఉన్నతమైన సమాజానికి విద్యార్థులు మార్గదర్శకులు కావాలి

**విశాలాంధ్ర - నరసన్నపేట :** ఉన్నతమైన సమా జానికి విద్యార్థులు మార్గ దర్శకులు కావాలని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్, డా.పి.లత అన్నారు. శుక్రవారం స్థానిక ప్రభుత్వ డిగ్రీ, పి.జి కళాశాలలో విద్యార్థులు వీడ్కోలు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్, డా.లత మాట్లా డుతూ డిగ్రీ తర్వాత విద్యార్థులు నిజ జీవితంలో పలు సమస్యలను అధిగమించటానికి సిద్ధంగా ఉండాలని, సవాళ్ళను అధిగమించి, భావి తరాలకు ఆదర్శంగా నిలవాలన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు నిర్వహించిన పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. పలు పోటీల్లో ప్రతిభ కనబర్చిన విద్యార్థినులకు కళాశాల ప్రిన్సిపాల్ బహుమతులు అందచేశారు. ఈ కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## ప్రజా సంక్షేమమే కూటమి ప్రభుత్వం లక్ష్యం

### రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి అచ్చంనాయుడు

**విశాలాంధ్ర - సంతబొమ్మాళి :** ప్రజా సంక్షేమమే కూటమి ప్రభుత్వం లక్ష్యమని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చం నాయుడు అన్నారు. శుక్రవారం రాత్రి సంతబొమ్మాళి మండలం చెట్ల తాండ్ర సంతబొమ్మాళి రహదారులను పునర్నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రహదారులు నిర్మాణానికి కూటమి ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇవ్వడం జరుగుతుందని అన్నారు. టెక్కలి నియోజకవర్గం లో కింజరాపు కుటుంబీకులను 45 సంవత్సరాలుగా ప్రజలు ఆదరిస్తూ వస్తున్నారని, మీ మేలు ఎన్నటికీ కింజరాపు కుటుంబం మరిచిపోదని అన్నారు. అలాగే చెట్ల తాండ్ర గ్రామంలో వేంచేసి ఉన్న శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి ఆలయం అభివృద్ధికి కృషి చేయడం జరుగుతుందని అన్నారు. ఇటీవల సంతబొమ్మాళిలో సూర్యనారాయణ స్వామి దేవాలయం నిర్మాణానికి శంకుస్థాపనకు వచ్చానని అప్పట్లో కోటబొమ్మాళి సంతబొమ్మాళి రహదారులు పరిశీలించాలని, వైయస్సార్ ప్రభుత్వంలో పూర్తిగా రహదారులు పనులు చేయకుండా నిర్వీర్యం చేయడంతో గోతులమయంగా మారాయి అన్నారు. ప్రస్తుతం రహదారు నిర్మాణం వేగవంతమైతే సుఖవంతమైన ప్రయాణం జరుగుతుందన్నారు. అలాగే మత్స్యకారు భరోసా త్వరలో మత్యకారుల ఎకౌంట్లోకి కూటమి ప్రభుత్వం నిధులు జమ చేస్తుందని అన్నారు. ఈ కార్యక్రమంలో టెక్కలి ఆర్డిఓ ఎం కృష్ణమూర్తి, సంతబొమ్మాళి ఎంపీడీవో పి జయంతి ప్రసాద్, తాసిల్దార్ అప్పలరాజు, సంతబొమ్మాళి మండలం తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు జీరు భీమారావు, రెడ్డి అప్పన్న, మాజీ జడ్పిటిసి బాడన రమణమ్మ, ఎల్ ఎల్ నాయుడు, తెలుగుదేశం పార్టీ నాయకులు సూరాడ ధనరాజు, సూరడ దాసురాజు, సూరాడ రాయుడు, వరపతి రాజశేఖరరెడ్డి, మెండ అప్పారావ్, కూచెట్టి కాంతారావు, బెండి అరుణ్ కుమార్, కూచెట్టి భాను ప్రకాష్ , శవ్వాన ప్రసాదరావు, కర్రీ రామిరెడ్డి, పంగ అసిరినాయుడు, తెలుగుదేశం పార్టీ నాయకులు కార్యకర్తలు అభిమానులు పాల్గొన్నారు.

# ఉత్తమ తెలుగు జర్నలిస్టులకు ఉగాది పురస్కారాలు

**విశాలాంధ్ర - కవిటి :** అక్షరాస్త్రాలతో సమాజాన్ని చైతన్య పరిచే బృహత్తర బాధ్యతను నిర్వర్తిస్తున్న జర్నలిస్టులకు" ఉత్తమ తెలుగు జర్నలిస్టులకు ఉగాది పురస్కారాలు" అందించి గౌరవించాలని తెలుగు జర్నలిస్టుల సంక్షేమ సంఘం నిర్ణయించిందని ఆ సంఘం వ్యవస్థాపక అధ్యక్షులు మేడవరపు రంగనాయకులు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రెండు తెలుగు రాష్ట్రాల నుండి 100 మంది ఉత్తమ జర్నలిస్టులకు ఈ నెల 12 తారీఖున విజయవాడలో గల తుమ్మలపల్లి కళాక్షేత్రంలో పురస్కా రాలు అందజేస్తున్నట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమానికి భారత సుప్రీంకోర్టు 48వ ప్రధాన న్యాయమూర్తి నూతలపాటి వెంకట రమణ ముఖ్య అతిథిగా హాజరై తన స్వహస్తాలతో పురస్కారాలు అందజేయనున్నట్లు తెలిపారు. విశిష్ట అతిథిగా రాష్ట్ర మంత్రి, ప్రముఖ సినీ నటుడు, నిర్మాత, పలువురు ప్రముఖులు హాజరవుతున్నట్లు వివరించారు. 2024 సంవత్సరంలో 45 మంది, 2025 సంవత్సరంలో 45 మంది, మహిళా జర్నలిస్టులకు ప్రత్యేకంగా 10 పురస్కారాలు అందజేస్తున్నట్లు తెలిపారు. గత ఏడాదికి సంబంధించి ఉత్తమ జర్నలిస్టులను గతంలోనే ప్రకటించామని, ఈ ఏడాది 25 విభాగాలతో పాటు తెలుగు రాష్ట్రాల్లోని ఒక్కో ఉమ్మడి జిల్లా నుండి ఒకరిని ప్రతిభ, అనుభవాన్ని పరిగణనలోకి తీసుకుని ఎంపిక చేశామని అన్నారు. ఎంపిక కాబడ్డ వారికి రూ. 5వేలు నగదుతో కూడిన పురస్కారం, ప్రశంసాపత్రం, రూ.20 లక్షల ప్రమాద బీమా అందజేయనున్నట్లు వెల్లడించారు. అక్షరాన్నే నమ్ముకుని ఎన్నో ఏళ్లుగా పాత్రికేయ వృత్తిలో కొనసాగుతున్న వారికి ఇటువంటి ప్రోత్సాహం ఎంతగానో ఉత్తేజాన్నిస్తుందని, వృత్తి పట్ల మరింత నిబద్ధతను, అంకిత భావాన్ని పాదుకొల్పడానికి దోహదపడుతుందని ఆశిస్తున్నామన్నారు. జర్నలిస్టు సంఘాలంటే పోరాటాలకు, సంక్షేమ కార్యక్రమాలకు మాత్రమే పరిమితమయ్యే మూస ధోరణికి పరిమితం కాకుండా జర్నలిస్టులను వృత్తిపరంగా ప్రోత్సాహించే వినూత్న కార్యక్రమానికి తమ తెలుగు జర్నలిస్టుల సంక్షేమ సంఘం శ్రీకారం చుట్టడం సంతోషదాయకం అన్నారు. పురస్కారాలు అందుకున్న వారిలో అన్ని రకాల పత్రికల్లో, మీడియాలో పనిచేస్తున్న వారు,పలు జర్నలిస్టు సంఘాలకు చెందిన వారు ఉన్నారనితెలిపారు. జర్నలిస్టు ప్రతిభే ప్రామాణికంగా, అత్యంత పారదర్శకంగా పురస్కార గ్రహీతలను ఎంపిక చేసినట్లు పేర్కొన్నారు.రెండు తెలుగు రాష్ట్రాలలోనూ విశేష ఆదరణ పొందుతున్న తెలుగు జర్నలిస్టుల సంక్షేమ సంఘం సభ్యులు,రాష్ట్ర,జిల్లా నాయకులు భారీగా తరలిరావాలని ఈ కార్యక్రమం విజయవంతంలో పాలుపంచుకోవాలని కోరారు. జర్నలిస్టులను గౌరవించడం అంటే మనల్ని మనం గౌరవించుకోవడమేనని,కావున జర్నలిస్టు సంఘాలకు, ప్రాంతాలకు,పత్రికలకు అతీతంగా ప్రతి ఒక్కరూ హాజరై ఈ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

## కోలాటం స్టిక్స్ అందజేత

### వ్యాయామ ఉపాధ్యాయుడు బాడాన నారాయణరావు

**విశాలాంధ్ర - టెక్కలి :** అరుదైన కళలో ప్రస్తుతం కోలాటం కూడా అరుదుగా కనిపిస్తుంది. టెక్కలి మండలం పోలవరం గ్రామంలో శ్రీ సాయి గణేష్ కోలాటం ఆధ్వర్యంలో విద్యార్థులకు కోలాటం నేర్పించడం జరుగుతుంది. అయితే ఈ మధ్యకాలంలో పోలవరం గ్రామంలో జరిగిన పాసిపోవులమ్మ అమ్మవారు గ్రామ సంబరాల్లో కోలాటం నృత్య ప్రదర్శన విద్యార్థులు మామూలు కర్రలతో అద్భుతమైన ప్రదర్శన ఇవ్వగా వారు చేసిన నృత్య ప్రదర్శనకు విశేష ఆదరణ లభించింది. విద్యార్థులు చేసిన నృత్యాన్ని గుర్తించి వ్యాయామ ఉపాధ్యాయుడు బాడాన నారాయణరావు వారిని అభినందించి వారికి కోలాటం స్టిక్స్ ను బహుమతిగా ఇస్తానని అదే సంబరాల్లో వెల్లడించారు. ఈ సందర్భంగా శుక్రవారం పోలవరం గ్రామంలో సాయినాధుని మందిరంలో కోలాటం నేర్చుకుంటున్న విద్యార్థులకు 25 జతల కోలాటం స్టిక్స్ చాకిపల్లి జడ్పీహెచ్ఎస్ పాఠశాలకు వ్యాయామ ఉపాధ్యాయులు బాడాన నారాయణరావు అందించారు. మరుగున పడుతున్న కలను గుర్తించి ఆదరించిన నారాయణరావును కోలాటం శిక్షకులు మరియు విద్యార్థులు ధన్యవాదాలు తెలియజేశారు.

## ఇంట్లో గ్యాస్ లీకై.. సిలిండర్‌కు మంటలు

**విశాలాంధ్ర - హిరమండలం :** మండలకేంద్రమైన హిర మండలం మేజర్ పంచాయతీ లోని చిన్న కోరాడ వీధిలో ఓ ఇంట్లో శుక్రవారం పెను ప్రమాదం తప్పింది. బాధితుడు దేవర శెట్టి శ్రీనివాసరావు తెలిపిన వివరాల మేరకు ఇంట్లో వంట చేయడానికి తన భార్య శ్రీదేవి స్టవ్ ను వెలిగించగా.. ట్యూబు ద్వారా గ్యాస్ లీకై సిలిండర్ లో.. మంటలు చేలరేగాయి. ప్రమాదాన్ని గ్రహించి తన భార్య భయంతో బయటికి పరుగులుతీసింది. చిన్న కోరాడ సెంటర్ లో చిన్న హెూటల్ నిర్వహిస్తున్న తనకు సమాచా రం తెలియడంతో ఇంటి వద్దకు వచ్చేసరికి చేలరేగిన అగ్నికీలలతో ఇళ్లంతా దట్టమైన పొగ అవరించడంతో బీతిల్లినట్లు చెప్పాడు. చుట్టుపక్కల వారు వచ్చి పెద్ద కోరాడ

వీధిలో హెచ్ పి గ్యాస్ ఏజెన్సీఆఫీస్ కి, కొత్తూరు ఫైర్ సిబ్బందికి సమాచారం అందించారు. గ్యాస్ ఆఫీస్ నుంచి వచ్చిన కృష్ణం రాజు అనే వ్యక్తి మంటలు ఆర్పే సిలెండర్ సహాయంతో మంటలను పూర్తిగా అదుపు చేయడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు. ఆసమయం విద్యుత్ సరఫరా కూడా లేకపోవడంతో పెను ప్రమాదం తప్పింది. కొత్తూరు నుంచి అగ్నిమాపక సిబ్బంది వచ్చేసరికి మంటలు పూర్తిగా అదుపులోకి వచ్చాయి.


**CHANGE OF NAME**

I, TEPPALA LAKSHMI NARAYANA, presently residing at SOMPETA (Vill & Post), TK SOMPETA, Dist SRIKAKULAM, State ANDHRA PRADESH, Pin 532284, have changed my son name from **T.SANKETH** to **TEPPALA SANKETH** Vide affidavit dated 04-04-2025 before (Additional District Court Sompeta, Sompeta).

## 6న పలాసలో ఉత్కలాంధ్ర కవి సమ్మేళనం

విశాలాంధ్ర-పలాస: శ్రీరామ నవమి సందర్భంగా జన జాగృతి సాహితీ సాంస్కృతిక సమాఖ్య సౌజన్యంతో పలాస లైన్స్ క్లబ్ కార్యాల యంలో ఈ నెల 6న ఉత్కలాంధ్ర (ఆంధ్ర- ఒడిశా రెండు రాష్ట్రాల) ఆహ్వానిత కవి సమ్మేళనం నిర్వహిస్తున్నామని జన జాగృతి అధ్యక్షులు కుమార్ నాయక్, వ్యవస్థాపకులు తేప్పల కృష్ణమూర్తి, కార్యదర్శి బి .కాళిదాసు తెలిపారు. కవితా పఠనంలో పాల్గొన్న కవులందరికీ సత్కరిస్తామని ,కవి సమ్మేళన అనంతరం కవన భోజనం ఏర్పాటు చేశామని తెలిపారు. సమ్మేళనంకు ప్రవేశ రుసుము లేదని, ఆహ్వానిత కవులు హాజరై జయప్రదం చేయాలని కోరారు.

## గ్రామ స్థాయి నుంచి పార్టీ పటిష్టతకు చర్యలు: తిలక్

విశాలాంధ్ర-టెక్కలి: గ్రామ స్థాయి నుంచి వైసిపి పార్టీ పటిష్టతకు చర్యలు తీసుకోవాలని నియోజకవర్గ ఇన్చార్జ్ పేరాడ తిలక్ కోరారు. శుక్రవారం టెక్కలి పార్టీ కార్యాలయంలో నూతనంగా నియమితులైన మండల వైసిపి పార్టీ కార్యవర్గ సమావేశంలో పాల్గొని పార్టీ పటిష్టతకు తీసుకోవలసిన చర్యలపై దిశా నిర్దేశం చేశారు. ఈ సందర్భంగా తిలక్ మాట్లాడుతూ గ్రామ స్థాయిలో కార్యకర్తలంతా కలిసికట్టుగా పార్టీ అభివృద్ధికి పాటుపడాలని సూచించారు. జగన్మోహన్ రెడ్డిని మరోసారి ముఖ్యమంత్రిని చేసుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందని అన్నారు. టిడిపి పార్టీ చేస్తున్న అరాచక పాలనను ప్రజల్లోకి తీసుకు వెళ్లాలని, రాష్ట్ర మంత్రి అచ్చన్నాయుడు గ్రామాల్లో గొడవలు సృష్టించి వైసిపి పార్టీ కార్యకర్తలను పై తప్పుడు కేసులు బనాయిస్తున్నారని, నిరుపేదలకు అన్యాయం చేస్తున్నారని దీనిపై పోరాటానికి సిద్ధం కావాలని సూచించారు. అనంతరం నూతనంగా నియమితులైన టెక్కలి మండల పార్టీ కార్యవర్గ సభ్యులు తిలక్ని అభినందించగా నూతనంగా ఎన్నికైన కార్యవర్గాన్ని తిలక్ కండువాలతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు హనుమంతు వెంకటేశ్వరరావు, వైసిపి అధికార ప్రతినిధి సత్తారు సత్యం, టెక్కలి టౌన్ ప్రెసిడెంట్ తమన్నగారి కిరణ్, టెక్కలి నియోజకవర్గ అనుబంధ విభాగం అధ్యక్షులు ఆట్ల రాహుల్ తోపాటు వైసిపి నాయకులు పాల్గొన్నారు.

## టిడిపి పార్టీతోనే యాదవులకు మేలు

విశాలాంధ్ర-టెక్కలి: టిడిపి పార్టీ తోనే యాదవులకు మేలు జరుగుతుందని బీసీ యాదవ సంక్షేమం మరియు అభివృద్ధి సంస్థ డైరెక్టర్ ఇప్పిలి జగదీశ్వరరావు యాదవ్ అన్నారు. బుధవారం రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు సమీక్షలో యాదవ కార్పొరేషన్ డైరెక్టర్ గా ప్రమాణస్వీకారం చేసి, ప్రమాణం పత్రంపై సంతకం చేశారు. ఈ సందర్భంగా జగదీశ్వరరావు మాట్లాడుతూ యాదవులకు రాజకీయంగా, ఆర్థికంగా ఎదిగేలా చేసింది ఒక్క

టీడీపీ మాత్రమేనని అన్నారు. రాష్ట్రంలో ఉమ్మడి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత బీసీలకు పెద్దపీట వేసిందని, అందులో యాదవ సామాజిక వర్గానికి టిడిపి అధినేత ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సముచిత స్థానం కల్పించారని తెలిపారు. యాదవుల పట్ల ముఖ్యమంత్రికి ఎంత అభిమానం ఉందో ఆయన చేతలలో చూపించారని కొనియాడారు. బీసీ రిజర్వేషన్లు మళ్లీ అధిక ప్రాధాన్యత కల్పించారని గుర్తు చేశారు. ఈ పదవిపై బాధ్యత వహిస్తూ కష్టాలలో ఉన్న యాదవ కుటుంబాలకు అండగా నిలుస్తానని, వారి సమస్యలు పరిష్కారానికి కృషి చేస్తానని అన్నారు. శ్రీకాకుళం జిల్లాలో యాదవ కార్పొరేషన్లలో జిల్లా నుండి ఇద్దరు యాదవులకు అవకాశం కల్పిస్తే అందులో టెక్కలి నియోజకవర్గం నుండి ఇప్పిలి జగదీశ్వరరావు అనే నాకు అవకాశం కల్పించిన రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు, కేంద్రమంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు, కోటబొమ్మాళి మాజీ పిఎసిఎస్ అధ్యక్షులు కింజరాపు హరివర ప్రసాద్, మండల అధ్యక్షులు బగాది శేషగిరిరావు కి ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేస్తున్నానని ఒక ప్రకటనలో తెలిపారు. డైరెక్టర్ గా ప్రమాణ స్వీకారం చేసిన ఇప్పిలి జగదీశ్వరరావుకు కుటుంబ సభ్యులతో పాటు, పలువురి నాయకులు, అభిమానులు అభినందనలు తెలియజేశారు.

## మహిళలు రాజకీయాల్లోకి రావాలి : ఎమ్మెల్యే గౌతు

విశాలాంధ్ర-పలాస(పర్లాఖిమిడి): మహిళలు అన్ని రంగాల్లో ప్రస్తుతం దూసుకు పోతున్నారని, రాజకీయ రంగంలో కూడా మహిళలు చక్కనైన పాత్ర పోషిస్తున్నారని, భవిష్యత్ లో ఈ రంగంలోకి అధిక సంఖ్యలో మహిళలు రావాలని పలాస ఎమ్మెల్యే గౌతు శిరీష ఆకాంక్షించారు. శుక్రవారం ఒడిశా, పర్లాకిమిడిలోని సెంచూరియన్ యూనివర్సిటీలో నిర్వహించిన నేషనల్ ఉమెన్ స్టూడెంట్ పార్లమెంట్ 2024-25కు ముఖ్య అతిధిగా పలాస ఎమ్మెల్యే గౌతు శిరీష హాజరయ్యారు.

ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో ఆమె మాట్లాడుతూ ప్రజా సమస్యలను తన సమస్యలుగా భావించి, వాటిని పరిష్కరించాలనే తపన ఉన్న మహిళలు తప్పనిసరిగా రాజకీయ రంగంలోకి అడుగుపెట్టాలని, విద్యార్థి దశలోనే నాయకత్వ లక్షణాలను పెంపొందించుకోవాలని సూచించారు. తాను రాజకీయ రంగంలోకి అడుగుపెట్టినప్పుడు తన కుటుంబం వెన్నుదన్నుగా నిలిచిందన్నారు. ఈ నేపథ్యంలో ప్రత్యర్థులు సామాజిక మాధ్యమాల్లో కించపరుస్తూ తన ప్రతిష్టను దెబ్బ తీసి, వ్యక్తిత్వ హననం చేసి వెనక్కు పంపాలని కుయుక్తులు పన్నారని తన జీవితంలో ఎదురైన పలు సంఘటనలను అక్కడి విద్యార్థులతో పంచుకున్నారు.

## లెక్క చెప్పకపోతే చంపేస్తాం: కేసు కట్టకండి

### పోలీసులు ఎదుటే రెచ్చిపోయిన మండల టీడీపీ అధ్యక్షుడు

### మూలపేట మాజీ సర్పంచ్ జీరు భీమారావు

విశాలాంధ్ర - సంతబొమ్మాళి: మూలపేట గ్రామానికి సంబంధించిన డబ్బులు ఈ వివరాల లెక్కలు చెప్పకపోతే చంపేస్తామని మీరు మాత్రం కేసు పెట్టకండి అని మండల టిడిపి పార్టీ అధ్యక్షుడు జీడి భీమారావు హెచ్చరించారు. వివరాల్లోకి వెళ్తే మండలం మూలపేట గ్రామానికి చేపల కట్టు వేలంపాట ద్వారా, ఇతర మార్గాల ద్వారా ప్రతి ఏడాది లక్షల్లో ఆ గ్రామానికి ఆదాయం వస్తుంటాది. 15 ఏళ్లుగా టిడిపి నాయకుడు కోట నారం నాయుడు ఆధీనంలో గ్రామం డబ్బులు ఉండేవి. వైఎస్ఆర్సిపి అధికారంలోకి వచ్చిన తర్వాత స్థానిక సర్పంచ్ జీరు బాబురావు చేతికి గ్రామం డబ్బులు మారాయి. అయితే మరల కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో ఈ ఏడాది నిర్వహించిన చేపల కట్టు వేలంపాట ద్వారా వచ్చిన సుమారు 40 లక్షల రూపాయలు టీడీపీ నాయకుడు కోట నారం నాయుడు చేతిలోకి వెళ్లిపోయింది. అయితే గత ఐదు సంవత్సరాలుగా సర్పంచ్ బాబురావు దగ్గర ఉన్న గ్రామం సొమ్ము లెక్కలు చెప్పి తమకు అప్పజెప్పాలని టిడిపి నాయకులు కోరారు. గత 15 సంవత్సరాలుగా మీ దగ్గర ఉన్న డబ్బులు లెక్క చెప్తే నేను కూడా లెక్క చెప్తానని అనడంతో ఇరు వర్గాల మధ్య ఘర్షణ వాతావరణం తలెత్తడంతో నౌపడ పోలీస్ స్టేషన్ను ఆశ్రయించారు. మీ అందరూ వచ్చి ఇక్కడ అరవడం వల్ల లా అండ్ ఆర్డర్ ప్రాబ్లం వస్తుందని ఎస్ఐ చెప్పిన వినిపించుకోకుండా మేమంతా పబ్లిక్ అని పోలీసులకు సమాధానం ఇచ్చారు. సర్పంచ్ బాబురావు లెక్క చెప్పాలని పోలీసులతో వాగ్వాదానికి దిగారు. మా ఊరు వదలం... ఎవరికి పిడిఎఫ్లు ఇచ్చారు, ఎవరికి డబ్బులు ఇచ్చారని ఇల్లు ఖాళీ చేయమంటున్నారని రెచ్చిపోయారు. మధ్యాహ్నం వరకు పోలీస్ స్టేషన్ వద్ద ఉద్రిత వాతావరణం నెలకొందంతో చివరకు పోలీసులు రేపు సర్పంచ్ బాబురావు లెక్కలు చెప్తారని నచ్చజెప్పి చెప్పడంతో అక్కడినుంచి వెళ్లి పోవడంతో వివాదం తాత్కాలికంగా సద్దుమణిగింది.

# నరసన్నపేట ఏఎంసీ ఛైర్మన్‌గా పాగోటి ఉమామహేశ్వరి

విశాలాంధ్ర-నరసన్నపేట: నరసన్నపేట వ్యవసాయ మార్కెట్ కమిటీ ఛైర్మన్‌గా పాగోటి ఉమామహేశ్వరి నియమితులయ్యారు. నరసన్నపేట, పోలాకి మండలాలకు చెందిన వ్యవసాయ మార్కెట్ కమిటీకి ఒక మహిళ ఛైర్మన్‌గా ఎంపిక కావటం ఇదే ప్రథమం. మండలంలోని కంబకాయ గ్రామానికి చెందిన పాగోటి ఉమామహేశ్వరి ప్రాథమిక స్థాయి నుండి తన సేవలను గ్రామంలో అందిస్తూ, కంబకాయ పంచాయితీ సర్పంచ్‌గా మూడు పర్యాయాలు చేశారు. అలాగే జిల్లా సర్పంచ్‌ల సంఘం ట్రెజరర్‌గా సేవలు అందించారు. దీనితో పాటు టిడిపి తెలుగు మహిళా మండల అధ్యక్షురాలుగా రెండు పర్యాయాలు సేవలు అందచేశారు. ప్రస్తుతం ఉమామహేశ్వరి, శ్రీకాకుళం పార్లమెంటరీ పార్టీ తెలుగు మహిళా ప్రధాన కార్యదర్శిగా, కంబకాయ పంచాయితీ గ్రామ పార్టీ అధ్యక్షురాలుగా బాధ్యతలు వహిస్తున్నారు. అంతేకాక జిల్లా తెలుగు మహిళా కార్యవర్గ సభ్యురాలుగా, కంబకాయ పంచాయితీ బూత్-80 కన్వీనర్‌గా సేవలు అందిస్తున్నారు. గత 1990వ సంవత్సరం నుండి తెలుగుదేశం పార్టీకి సేవలు అందిస్తూ, ఇటు రాజకీయంగా, అటు పంచాయితీలో ప్రజల మన్ననలు పొందుతున్న పాగోటి ఉమామహేశ్వరి నరసన్నపేట ఏ.ఎం.సి ఛైర్మన్‌గా ఎంపిక కావటం పట్ల నియోజకవర్గంలోని పలువురు తెలుగుదేశం పార్టీకి చెందిన శ్రేణులు ఆమెకు శుభాకాంక్షలు తెలియచేశారు. ఏ.ఎం.సి ఛైర్మన్‌గా ఎంపికైన పాగోటి ఉమామహేశ్వరీ భర్త, పాగోటి అప్పలనాయుడు గత 1983వ సంవత్సరం నుండి టిడిపికి ఆకర్షితుడై, పంచాయితీలో పలు సేవా కార్యక్రమాలు చేస్తూ ఉండేవారు. ప్రభుత్వ ఉపాధ్యాయునిగా పలు సంవత్సరాలు పనిచేసి, గత కొన్ని నెలల క్రితం పదవీ విరమణ చేసిన అప్పలనాయుడు, కంబకాయ పంచాయితీకి, మండల టిడిపికి తన సతీమణి, పాగోటి ఉమామహేశ్వరితో కలిసి సేవలందించినందుకు రాష్ట్ర ప్రభుత్వం నరసన్నపేట ఏ.ఎం.సి ఛైర్మన్‌గా పదవికి ఆమెను ఎంపిక చేయటం సరైనదేనని పలువురు టిడిపి నాయకులు తెలిపారు. ఏ.ఎం.సి ఛైర్మన్‌గా ఎంపికైన ఉమా మహేశ్వరి విశాలాంధ్రతో శుక్రవారం మాట్లాడుతూ పదవిని ఇచ్చి, నరసన్నపేట, పోలాకి మండలాల్లో తమ గౌరవాన్ని పెంచిన రాష్ట్ర ముఖ్యమంత్రి, నారా చంద్రబాబునాయుడుకు, ఉప ముఖ్యమంత్రి, పవన్ కళ్యాణ్‌కు, రాష్ట్ర విద్యాశాఖా మంత్రి, నారా లోకేష్‌కు, రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి, కింజరాపు అచ్చెన్నాయుడుకు, శ్రీకాకుళం పార్లమెంటరీ సభ్యులు, కింజరాపు రామ్మోహన్‌నాయుడుకు, నరసన్నపేట ఎమ్మెల్యేకు, బగ్గు రమణమూర్తికి హృదయపూర్వకంగా కృతజ్ఞతలు తెలియచేశారు.

# తెరుచుకోని ప్రధాన గేట్లు...నిలిచిన ఆధార్ సేవలు

- తపాలా కార్యాలయం వద్ద పడిగాపులు కాస్తున్న ప్రజలు
- పశుసంవర్ధక శాఖ సిబ్బంది మితిమీరిన ఉత్సాహం

విశాలాంధ్ర-టెక్కలి: మండల కేంద్రంలో స్థానిక తపాలా కార్యాలయంలో ఉదయం 7 గంటల నుండి ప్రారంభం కానున్న ఆధార్ సేవలు ప్రారంభం కాకపోవడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. మండల కేంద్ర తపాలా కార్యాలయానికి పశుసంవర్ధక శాఖ కార్యాలయానికి ఒకే ప్రధాన రహదారి ఉండటంతో పశుసంవర్ధక శాఖ కార్యాలయ సిబ్బంది మితిమీరిన ఉత్సాహం చూపిస్తూ గేట్లు తెరవకపోవడంతో ఆధార్ సేవలు నిలిచిపోయాయి. దూర ప్రాంతాల నుంచి ఆధార్ సేవలు కోసం వచ్చిన ప్రజలకు పడిగాపులుకాయాల్సిన పరిస్థితి నెలకొందని వాపోతున్నారు. తపాలా కార్యాలయంలో జరుగుతున్న ఆధార్ నమోదు, సవరణ ప్రక్రియకు వచ్చే స్థానికులు పశుసంవర్ధక శాఖ కార్యాలయం నుంచి వెళ్లకుండా సిబ్బంది అడ్డుకొని తాళాలు వేయడంతో స్థానిక ప్రజలు మండిపడుతున్నారు. ఇప్పటికైనా ఈ సమస్యపై ఉన్నత అధికారులు స్పందించి గేట్లు తాళాలను రెండు కార్యాలయాల సిబ్బంది దగ్గర అందుబాటులో ఉండేటట్టు చూడాలని ప్రజలు కోరుకుంటున్నారు.

# సర్కారు కుతంత్రాలకు సమాధి కట్టండి

- వైసీపీ శ్రేణులకు చింతాడ పిలుపు

విశాలాంధ్ర-పొందూరు: కూటమి పథకాలు పేరుతో ప్రజలకు మోసం చేసిన సర్కారు కుతంత్ర రాజకీయాలకు సమాధి కట్టాలని వైసీపీ శ్రేణులకు ఆమదాలవలస నియోజక వర్గ ఇంచార్జి చింతాడ రవికుమార్ అన్నారు. మండల కేంద్రంలో పట్టుసాలి కళ్యాణ మండపంలో శుక్ర వారం జరిగిన పార్టీ మండల విస్తృతస్థాయి సమావేశంలో పాల్గొని మాట్లాడారు. అధికారాన్ని చలాయించి వైసీపీ శ్రేణులపై బెదిరింపులు చేస్తే ఉపేక్షించేది లేదని హెచ్చరించారు. ప్రతీ కార్యకర్త ప్రజలతో మమేకమై పనిచేయవలసిన అవసరం ఉందన్నారు. ప్రజా సమస్యల పోరాటంతోనే పార్టీ అభివృద్ధి ధ్యేయంగా పనిచేయాలని కోరారు. ఆమదాలవలస నియోజకవర్గంలో పూర్వవైభవాన్ని తీసుకురావడానికి కార్యకర్తలు సైనికులలా పనిచేయాలని కోరారు. ప్రజా సమస్యల వెలుగు తీసి పోరాటం చేసినప్పుడే పార్టీ అభివృద్ధికి సోపానాలు అవుతాయన్నారు. పార్టీ ఎన్నికల్లో ఓడిపోయిన ప్రజలలో ఇప్పటికీ పార్టీ నాయకులు జగన్మో హన్ రెడ్డి గారి పైన, పార్టీపైనా విశ్వాసం, నమ్మకం ఉందన్నారు. గతంలో కొన్ని కారణాల తో కార్యకర్తలు కు అందని ప్రాధాన్య త ను ఈసారి కార్యకర్తలు కు, నాయకులకు కల్పిస్తామని జగన్మోహన్ రెడ్డి స్పష్టం చేశారన్నారు.

కూటమి ప్రభుత్వం పై ఇప్పటికే తీవ్ర వ్యతిరేకత ప్రారంభమైందన్నారు. ఈ పరిస్థితుల్లో శ్రేణులు ఐక్యంగా ముందుకు వెళితే వచ్చే ఎన్నికల్లో విజయం ఖాయమని చెప్పారు. కార్యకర్తలు కు వ్యక్తిగతంగా తాను, పార్టీ అండగా ఉంటుందని హామీ ఇచ్చారు. ఏ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు కొంచాడ రమణమూర్తి, పట్టణ పార్టీ అధ్య క్షులు గాడు నాగ రాజు, జడ్పీటీసీ లోలుగు కాంతా రావు, సరుబుజ్జిలి వైసిపి మండల అధ్యక్షులు బెవర మల్లేశ్వరరావు, బొడ్డేపల్లి అజిత్ కుమారి,సురవరపు నాగేశ్వరరావు,చింతాడ ప్రసాద్, బండారు జై ప్రతాప్, చింతాడ ప్రసా%ం% అనకాపల్లి గోవిందరావు, బొడ్డేపల్లి పద్మజ , వందానసూరపు నాయుడు, వి వెంకట రావు, కె. నాగరాజు, పైడి నాగభూషణం, కె. రమణమ్మ,ఏ. రామకృష్ణ, బి. రమణ,పి రవి, వి మోహన్ సర్పంచ్ లు పెద్ద ఎత్తున కార్యకర్తలు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# 13న విప్లవ సంస్థల విలీన స్ఫూర్తితో పైల స్మారక సభ

### న్యూ డెమోక్రసీ రాష్ట్ర అధికార ప్రతినిధి ప్రసాద్

విశాలాంధ్ర-పలాస: భారత విప్లవోద్యమంలో శ్రీకాకుళం సాయుధ గిరిజన రైతాంగ పోరాటానికి ప్రత్యేక రాజకీయ విశిష్టత వుందని సిపిఐఎంఎల్ న్యూ డెమోక్రసీ రాష్ట్ర అధికార ప్రతినిధి పి ప్రసాద్ అన్నారు.శుక్రవారం పలాసలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ అమరజీవి పైలా వాసుదేవరావుకు చరిత్రలో సుస్థిర స్థానం ఉందన్నారు. ఇటు ఉద్దానంలో పంచాది కృష్ణమూర్తి, తామాడ గణపతి, పాణిగ్రాహి సుబ్బారావు, చాగంటి భాస్కరరావు, అటు ఏజెన్సీలో వెంపటాపు సత్యం, ఆదిభట్ల కైలాసం వంటి సుప్రసిద్ధ విప్లవ నేతలతో పాటు వందల మంది విప్లకారులను దారుణంగా ప్రభుత్వం పొట్టన పెట్టుకున్న తర్వాత విప్లవోద్యమ పునర్నిర్మాణం ఓ కీలక కర్తవ్యంగా ముందుకు వచ్చిందనీ, ఆ దశలో పైలా వాసుదేవరావు కీలక పాత్ర పోషించాడని అన్నారు. ఆ క్రమంలో ఆయన సిపిఐ (ఎం.ఎల్) రాష్ట్ర కార్యదర్శిగా, కేంద్ర కమిటీ సభ్యునిగా ఎదిగి అనేక ముఖ్య బాధ్యతలను చేపట్టారని గుర్తు చేశారు. పైల మృతి చెంది 15 ఏళ్ల నిండుతుందనీ, ఈ సందర్భంగా ఈ నెల 13 ఆదివారం పలాసలో పైలా వాసుదేవరావు 15వ వర్ధంతి సభను సిపిఐ (ఎం.ఎల్) న్యూ డెమోక్రసీ రాష్ట్ర కమిటీ ఏర్పాటు చేసిందన్నారు. ఈ సందర్భంగా ప్రదర్శన కూడా వుందన్నారు. ఈ ఏడాది నలుగురు ముఖ్య పార్టీ నాయకుల వర్ధంతులను ప్రత్యేకంగా జరిపి విప్లవస్ఫూర్తి పొందాలని తమ పార్టీ కేంద్ర కమిటీ భావించిందని అన్నారు. రాయల సుభాష్ చంద్రబోస్ (మార్చి), పైలా వాసుదేవరావు (ఏప్రిల్), చంద్ర పుల్లారెడ్డి (నవంబర్) మాదాల నారాయణ స్వామి (డిసెంబర్) ల ప్రత్యేక సంస్మరణ సభల ద్వారా విప్లవ స్ఫూర్తిని పొందాలని నిర్ణయం చేసిందని,ఈ నలుగురు ఉమ్మడి ఆంధ్ర రాష్ట్ర పార్టీ నిర్మాణంలో ఆయా దశల్లో అత్యంత కీలక పాత్ర పోషించడమే కాకుండా కేంద్ర కమిటీ సభ్యులుగా ప్రాతినిధ్యం వహించడం విశేషమని పేర్కొన్నారు. పైలా వాసుదేవరావు 15వ వర్ధంతి ఈ నెల 13న పలాసలో ఉదయం 10:30 కి స్మారక ప్రదర్శన ప్రారంభమై అప్పయ్య దొర ఇంటి సమీపంలో గల ఖాళీ స్థలంలో పార్టీ జిల్లా కార్యదర్శి తాండ్ర ప్రకాష్ అధ్యక్షతన బహిరంగ జరుగుతుందన్నారు. విలేకరుల సమావేశంలో తాండ్ర ప్రకాష్, వంకల మాధవరావు, వినోద్, జుత్తు వీరాస్వామి, పోతనపల్లి కుసుమ, సారా జగన్ తదితరులు పాల్గొన్నారు.

# రోడ్లు భవనాల శాఖ స్థలాలు ఆక్రమణ

## రోడ్డు ఆక్రమణతో నిత్యం ట్రాఫిక్ సమస్య

విశాలాంధ్ర-మందస: మండలం హరిపురం పంచాయతీ పారిశ్రామికంగా కేంద్రంగా అభివృద్ధి చెందుతోంది. పేరుకే పంచాయతీ అయినప్పటికీ ప్రముఖంగా పారిశ్రామిక వ్యాపార కేంద్రంగా మారింది. ఇక్కడ రోజుకు కోట్లాది రూపాయలు వ్యాపారం జరుగుతోంది.ఈ పంచాయతీ కేంద్రానికి సుమారు 100 మీటర్ల దూరంలో మందస పేరుతో రైల్వే స్టేషన్ ఉంది. హరిపురంకు ఆనుకుని బాలిగాం, నారాయణపురం, కుంటి కోట, సువర్ణపురం, మకరజోల గ్రామపంచాయతీలు ఉన్నాయి ఈ పంచాయతీల పరిధిలో కూడా వ్యాపార సంస్థలు విద్యాసంస్థలు జీడి పరిశ్రమలతో పాటు పలు రకాల పరిశ్రమలు ఉన్నాయి. పలాస నియోజకవర్గంలో అత్యంత ప్రాధాన్యత గల గ్రామీణ పంచాయతీల్లో హరిపురం ఒకటిగా ఓ ప్రత్యేక గుర్తింపు ఉన్నప్పటికీ రోడ్లు భవనాలు శాఖ స్థలాలు పబ్లిక్ గా ఆక్రమణకు గురవుతున్నాయి. దీంతో నిత్యం ట్రాఫిక్ సమస్య వెంటాడుతోంది. హరిపురం కేంద్రంలో ఉన్న రట్టి రోడ్డు జంక్షన్ నుంచి హరిపురం బాలిగాం బస్టాండ్, మందస రైల్వే స్టేషన్ రోడ్డు మీదుగా కొర్రాయి రైల్వే గేట్ వరకు ఉన్న రోడ్డులో రోడ్ల భవనాల శాఖకు చెందిన స్థలాలు ఇరువైపులా ఉన్నాయి. ఈ స్థలాలను ఆక్రమణదారులు బాహటంగా ఆక్రమించి భవనాలు షాపులు నిర్మించారు కోట్లాది రూపాయలు విలువ చేసే ఈ స్థలాలు కబ్జా జరుగుతున్నప్పటికీ ఆ శాఖ పూర్తిగా పట్టించుకోవడం లేదు. ఇకపోతే హరిపురం కేంద్రాన్ని అభివృద్ధి చేయాలన్న సంకల్పంతో పలాస నియోజకవర్గం మాజీ ఎమ్మెల్యే దివంగత నేత జుత్తు జగన్నాయకులు పర్యవేక్షణలో హరిపురం నుంచి బాలిగం జంక్షన్ మీదుగా మందస రైల్వే స్టేషన్ వరకు డబల్ తారు రోడ్డు నిర్మాణం జరిగింది. ఈ రోడ్డు నిర్మాణానికి దివంగత నేత మాజీ సీఎం వైయస్ రాజశేఖర్ రెడ్డి కోట్లాది రూపాయలు మంజూరు చేశారు అప్పట్లో హరిపురం బాలిగాం జంక్షన్ లో బస్సు షెల్టర్ నిర్మాణం కూడా జరిగింది. డబుల్ రోడ్డు నిర్మాణం జరిగిన తర్వాత మళ్లీ యథాతథంగా ఇటీవల కాలంలో ఆక్రమణదారులు తారు రోడ్డు నే ఆక్రమించి షాపులను ఇళ్లను నిర్మించుకుంటున్నారు. దీంతో బస్సులు ఇతర వాహనాలు రాకపోకలకు ఇబ్బందికరంగా మారింది. ప్రధాన రహదారి ఆక్రమణలతో ట్రాఫిక్ జామ్ ఇక్కడ ఎక్కువవుతుంది. ప్రతిరోజు వేలాదిమంది ప్రజలు విద్యార్థులు ఇక్కడ నుంచి రాకపోకలు సాగిస్తుంటారు పలు రకాల వేలాది వాహనాలు ఈ రోడ్డు మీదుగా వెళుతుంటాయి. ఎంతో ప్రాధాన్యత గల హరిపురం రహదారి ఆక్రమణలకు గురి కావడంతో రోడ్డు ఆనవాళ్లు లేకుండా పోతుంది తక్షణమే ఉన్నతాధికారులు ప్రజాప్రతినిధులు స్పందించి రోడ్డు ఆక్రమణలు తొలగింపుకు చర్యలు తీసుకోవాలని ఇక్కడ ట్రాఫిక్ సమస్య లేకుండా చేయాలని ప్రజలు కోరుతున్నారు.

## 8న విద్యుత్ వినియోగదారుల పరిష్కార న్యాయస్థానం

విశాలాంధ్ర-ఆమదాలవలస: విద్యుత్ వినియోగదారుల సమస్యలను పరిష్కరించేందుకు ఈనెల 8వ తేదీన విద్యుత్ వినియోగదారుల పరిష్కార న్యాయస్థానం (క్యాంప్ కోర్ట్) కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఎలక్ట్రికల్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ పైడి యోగే శ్వరరావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమాన్ని ఆమదాలవలస పట్టణం ఇండస్ట్రియల్ ఏరియాలో ఉన్న తొగరాం సెక్షన్ కార్యాలయం వద్ద మంగళవారం ఉదయం 10.30 గంటల నుంచి మధ్యాహ్నం 1.30 గంటల వరకు కన్స్యూమర్ గ్రీవెన్స్ స్ ఫోరం ఛైర్మన్ ఆధ్వర్యంలో నిర్వహించడం జరుగు తుందని తెలియజేశారు. వినియోగదారులకు విద్యుత్ పై ఎటువంటి సమస్యలు ఉన్న నేరు గా తెలియజేసి పరిష్కారం పొందగలరని సూ చించారు. క్యాంపు కోర్టు కార్యక్రమం అనంతరం ఆమదాలవలస మండలం తొగరం గ్రామంలో ఉన్న ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో విద్యార్థులకు క్యాంపు కోర్ట్ పై అవగాహన కార్యక్రమం నిర్వ హిస్తున్నట్లు తెలియజేశారు.

## నాటుసారాతో వ్యక్తి అరెస్ట్

విశాలాంధ్ర-కవిటి: మొబైల్ పెట్రోలింగ్ పార్టీ సోంపేట మరియు ఎక్సైజ్ ఎన్ఫోర్స్మెంటు శ్రీకాకుళం సిబ్బంది వారు తనిఖీలు నిర్వహిస్తుండగా కవిటి మండలం ఎలమంచిపుట్టుగ గ్రామానికి చెందిన సూరయ్య 8 లీటర్ల నాటుసారాతో పట్టుబడ్డాడు. అతనికి నాటుసారా సరఫరా చేసిన కంచిలి మండలం కాకర్లపుట్టుగ గ్రామానికి చెందిన కాకర్ల సోమేసును అదుపులోకి తీసుకుని ఇద్దరిపైన కేసులు నమోదు చేసి సారాను స్వాధీనం చేసుకున్నట్లు ఎక్సైజ్, మొబైల్ పెట్రోలింగ్ పార్టీ సోంపేట మరియు ఇచ్ఛాపురం సీఐ జి.వి.రమణ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎక్సైజ్ మొబైల్ పెట్రోలింగ్ ఎస్సై సుజాత, సిబ్బంది పాల్గొన్నారు.

## రెంటికోటలో చలివేంద్రం ప్రారంభం

విశాలాంధ్ర-పలాస: వేసవి ఎండల దృష్ట్యా ప్రభుత్వ ఆదేశాల మేరకు కలెక్టర్ సూచనలతో శుక్రవారం మండలం రెంటికోట మెయిన్ రోడ్ లో ఏర్పాటు చేసిన చలివేంద్రంను రెంటికోట వైద్యాధికారి ఎస్.మౌనిక మరియు సర్పంచ్ శాసనపురి

తిరుమలరావులు ప్రారంభించారు. ఈ సందర్భంగా వైద్యాధికారి మౌనిక మాట్లాడుతూ ప్రజలు దూర ప్రాంతాలకు వెళ్లేటప్పుడు, పని చేసేటప్పుడు నాలుక పొడిబారిన,చర్మం పొడిబారిన వీలైనంతవరకు ఎక్కువగా నీటిని తీసుకోవాలని సూచించారు. అలాగే బయటకు వెళ్లేటప్పుడు గొడుగు లేదా టోపీని ధరించి వెళ్లాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఏపీఎన్జీవోస్ అధ్యక్షులు బోనెల గోపాల్ పంచాయతీ సెక్రెటరీ సద్గుణ రావు, మహిళా పోలీస్ వాసంతి ,టిడిపి నాయకులు కరియామంత్ర, పి హెచ్ న్ సత్యవతి, సూపర్వైజర్లు రిషికేశ్వరరావు, ఈశ్వరమ్మ, యు డి సి సుదర్శన్, విమల, ప్రభావతి, త్రివేణి ,యోగేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా నీలమణి అమ్మవారి వార్షికోత్సవం

విశాలాంధ్ర - సంతబొమ్మాళి: బడే నరసాపురంలో వెలసిన శ్రీ శ్రీ శ్రీ శ్రీ నీలమణి దుర్గ అమ్మవారి ఏకాదశ వార్షికోత్సవం విజయవంతం అయింది.

వేదపండితుల మంత్రోచ్చారణ మధ్య జరిగిన నవగ్రహ పూజలు, సూర్యన మస్కారాలు, రుద్రాభిషేకాలు మరియు పూర్ణాహుతి కార్యక్రమాలు గ్రామస్తులు అంతా పండగ వాతావరణం లో సక్రమంగా నిర్వహించారు. లోక కళ్యాణం కోసం, గ్రామ శ్రేయస్సు కోసం నిర్వహించిన ఈ కార్యక్రమం లో సర్పంచ్ భూషణ్ రెడ్డి, మాజీ సర్పంచ్ ఆల బైరాగిరెడ్డి, షణ్ముఖ మాస్టర్ గ్రామస్తులు పాల్గొన్నారు.

## రెడ్డి శాంతికి ఘన సత్కారం

విశాలాంధ్ర - కొత్తూరు: పార్టీ అధినేత జగన్ మోహన్ రెడ్డి మాజీ ఎమ్మెల్యే రెడ్డి శాంతిని వైసీపీ రాష్ట్ర క్రమశిక్షణ కమిటీ సభ్యులుగా నియమించారు. కొత్తూరులోని పలువురు వైసిపి నాయకులు శుక్రవారం పాతపట్నం మాజీ ఎమ్మెల్యే రెడ్డి శాంతి నివాసంలో కలసి అభినందనలు తెలియజేస్తూ పుష్పగుచ్చాలను అందజేసి దుస్సాలువలతో సత్కరించారు.

## నాటుసారా నిర్మూలనపై అవగాహన

విశాలాంధ్ర - కొత్తూరు: ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం ప్రోహిబిషన్, ఎక్సైజ్ శాఖ అధ్వర్యంలో నవోదయం 2.0 అనే కార్యక్రమం మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో లోతుగెడ్డ తులసీ వర ప్రసాద్‌రావు మాట్లాడుతూ ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశం సారా రహిత గ్రామాలను తయారు చేయడమేనని అన్నారు. అలాగే అందరూ నాటుసారాకి దూరంగా ఉండాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఎక్సైజ్ సీఐ, ఎంపిడిఓ పి.నీరజ, డిపార్ట్మెంట్ అధికారులు, కోయిలాపు శ్రీనివాస్‌రావు పాల్గొన్నారు.

## డల్లాస్‌లో సాఫ్ట్వేర్ నిపుణులతో రవికుమార్ భేటీ

**విశాలాంధ్ర - పొందూరు :** గూగుల్ సంస్థను ఆంధ్రప్రదేశ్ లో ఏర్పాటు చేసి యువత కు ఉద్యోగాలు కల్పించాలని గూగుల్ సంస్థ సీనియర్ అధికారులను, సీనియ ర్ సాఫ్ట్వేర్ ఉద్యోగులను పియూసీ చైర్మన్, ఎమ్మెల్యే కూన రవికుమార్ కోరారు. అమెరికా పర్యటనలో ఉన్న రవికుమార్ డాల్లాస్ లో ఉన్న గూగుల్ సంస్థ ను సందర్శించారు. ప్రస్తుతం సాఫ్ట్వేర్ రంగంలో అత్యంత కీలకమైన ఏ వన్ విశిష్టత ను గూగుల్ సీనియర్ డైరెక్టర్, సీనియర్ సాఫ్ట్వేర్ నిపుణులు వివరిం చారు.ఏపీ లో సంస్థ స్థాపించా లను కుంటే రాష్ట్ర ప్రభుత్వం అన్నివిధాలా సహకరి స్తుందని సంస్థ ప్రతినిధులకు హామీ ఇచ్చారు. అనంతరం గూగుల్ లో పనిచేస్తున్న తెలుగు రాష్ట్రాలకు చెందిన సీనియర్ సాఫ్ట్వేర్ ఉద్యోగులతో భేటీ అయ్యారు.

## జిల్లాకి దీటుగా టెక్కలిని అభివృద్ధి చేస్తాం : వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు

**విశాలాంధ్ర - టెక్కలి :** రహదారి నిర్మాణ పనులకు ప్రతి ఒక్కరూ సహకరించాలని వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు అన్నారు. మండల కేంద్రంలో అంబేద్కర్ కూడలి నుండి చెట్ల తాండ్ర వరకు రాష్ట్ర విపత్తు నిర్వహణ నిధులతో కోటి 43 లక్షలతో రహదారి నిర్మాణానికి స్థానిక తొలిసూరుపల్లి సమీపంలో శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ టెక్కలిని అభివృద్ధి చేయడానికి ప్రజలందరూ సహకరిస్తే వివిధ అభివృద్ధి కార్యక్రమాలతో అందంగా తీర్చిదిద్దుతానని అన్నారు. ఈ రహదారి వల్ల చాలామంది అనేక ఇబ్బందులు పడుతున్నారని, అందుకే వెంటనే 30 అడుగుల విస్తీర్ణతో రహదారి పనులకు శంకుస్థాపన చేశానని త్వరలోనే రహదారి నిర్మాణ పనులు కూడా పూర్తవుతాయని అందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలని అన్నారు. రహదారి నిర్మాణంలో ఎవరికైనా నష్టం జరిగితే అలాంటి వారికి ప్రభుత్వ స్థలాలు కేటా ఇస్తానని హామీ ఇచ్చారు. అధిక వర్షాలు కురిసే సమయంలో ఈ రహదారిలో ప్రధానంగా శ్రీనివాస నగర్ సమీపంలో వర్షపు నీటి వలన ప్రజల పడుతున్న ఇబ్బందులు అన్నీ ఇన్ని కాదు అని, త్వరలోనే అక్కడ కూడా ఒక కల్వర్టు నిర్మాణానికి చర్యలు తీసుకోవాలని అధికారులకు ఆదేశించానని తెలిపారు. కూటమి ప్రభుత్వంలో ప్రకటించిన ప్రతి సంక్షేమ పథకాలు ఒక్కొక్కటిగా నెరవేరుస్తున్నామని, త్వరలోనే ప్రతి ఒక్కరు చెప్పిన ప్రతి పథకాలు అందజేస్తామని అన్నారు. విద్యారంగంలో రానున్న జూన్ కల్లా విద్యార్థులకు పాఠశాల పరికరాలు, ప్రతి తల్లిదండ్రుల ఎకౌంటుకు 15 వేల రూపాయలు అందజేస్తామని అన్నారు. ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు త్వరలోనే రెండు కోట్ల రూపాయలతో రక్షణ గోడ నిర్మాణానికి చర్యలు చేపడతామని హామీ ఇచ్చారు. టెక్కలిలో ప్రతి వీధికి రహదారులు, కాలువలు, కొళాయిలు నిర్మాణ పనుల్లో కూటమి ప్రభుత్వం అడుగులు వేస్తుందని అన్నారు. శ్రీకాకుళం జిల్లాకి దీటుగా టెక్కలిని అభివృద్ధి చేస్తామని హామీ ఇచ్చారు. నిరుపేదలను గుర్తించి ప్రతి ఒక్కరికి ఇంటి స్థలాలు కేటా ఇస్తామని చెప్పారు. ప్రభుత్వ స్థలాలు, దేవాదయ శాఖ భూములను గుర్తించి వాటిని రక్షించే విధంగా కొత్త ల్యాండ్ గార్బింగ్ ఆక్ట్ కింద చట్టాన్ని తీసుకువచ్చి చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. ఎక్కడెక్కడ ప్రభుత్వ స్థలాలు ఉన్నాయో అలాంటివి గుర్తించి, వాటిలో పేదవాళ్ళకి ఇల్లు స్థలాలు కేటాయించే విధంగా చర్యలు తీసుకోవాలని, దానికి సంబంధించిన ప్రణాళికను సిద్ధం చేయాలని రెవెన్యూ డివిజనల్ అధికారి ఎం కృష్ణమూర్తిని ఆదేశించారు. నిరుద్యోగులుగా ఉన్న ప్రతి యువకులకు కొత్త పారిశ్రమాల ద్వారా అభివృద్ధి చేస్తూ ఉద్యోగ అవకాశాలు కల్పిస్తామని తెలిపారు. టెక్కలి ప్రజలందరూ సహకరిస్తే త్వరలోనే టెక్కలిని మునిసిపాలిటీ చేస్తానని, టెక్కలిని మునిసిపాలిటీగా టిడిపి తప్ప ఎవ్వరూ చేయలేరని అన్నారు. గత ఐదు సంవత్సరాలు వైసిపి ప్రభుత్వం ప్రజలకు మాయమాటలతో మోసం చేసిందని, జగనన్న కాలనీలో భారీ అక్రమానాలు జరిగాయని, వాటి అన్నిటిని స్వాధీనం చేసుకొని నిజమైన నిరుపేద ప్రజలకు ఆ స్థలాలను కేటాయించి పట్టాలను అందజేస్తామని హామీ ఇచ్చారు. టెక్కలి మధ్యలో ఉన్న పట్టుమహాదేవు కోనేరు నీ త్వరలోనే ఒక టూరిజం చేస్తానని మాట ఇచ్చారు. ప్రతి అభివృద్ధి పనులకు ప్రజలు సహకరిస్తే మండల కేంద్రాన్ని త్వరలోనే సుందరంగా తీర్చిదిద్దుతానని తెలియజేశారు.

**-సైనిక నగర్ సమస్యలపై వినతి...** కొన్ని సంవత్సరాల నుండి సైనిక్ నగర్ లో ఉన్న సమస్యలపై బిజెపి మండల అధ్యక్షులు జర్జన రాంజీ స్థానిక ప్రజలు మంత్రితో మాట్లాడుతూ కొన్ని సంవత్సరాల నుండి ఈ సైనిక్ నగర్‌లో రహదారులు లేక, త్రాగడానికి కొళాయిలు లేక, వీధిలో కాలువలు లేక అనేక ఇబ్బందులు పడుతున్నట్లు తమ సమస్యలను పరిశీలించి వెంటనే తీర్చే విధంగా సహకరించాలని మంత్రిని కలిసి వినతి పత్రాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో పిఎసిఎస్ మాజీ అధ్యక్షులు కింజరాపు హరి వరప్రసాద్, డివిజనల్ రెవెన్యూ అధికారి ఎం కృష్ణమూర్తి, మండల అధ్యక్షులు బగాది శేషగిరిరావు, ఆర్ అండ్ బి అధికారులు, రెవెన్యూ అధికారులు, పోలీస్ సిబ్బంది, టిడిపి నాయకులు, కార్యకర్తలు అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా గుండమ్మ తల్లి ఆలయ వార్షికోత్సవం

**విశాలాంధ్ర - కవిటి :** మండలంలో గల ప్రగడపుట్టుగ జంక్షన్లో వెలసిన గుండమ్మ తల్లి ఆలయ వార్షికోత్స వంను ఆ గ్రామ తెలగ కుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం ఘనంగా నిర్వ హించారు. ఈ సందర్భంగా ఉదయం అమ్మవారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేశారు. మధ్యాహ్నం అన్న ప్రసాద వితరణ చేపట్టారు. 12 గంటల పాటు స్థానిక కళాకారులతో భజన కార్యక్రమం నిర్వ హించారు. అధిక సంఖ్యలో భక్తులు వచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు.

## 13న గురుకుల ప్రవేశ పరీక్ష

**విశాలాంధ - ఎచ్చెర్ల :** ఆంధ్రప్రదేశ్ సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయాల సంస్థ ద్వారా నిర్వహిస్తున్న దుప్పలవలస, డాక్టర్ బీఆర్ అంబేద్కర్ గురుకులంలో 2025-26 విద్యా సంవ త్సరంలో ప్రవేశానికి పరీక్ష ఈ నెల 13న నిర్వహించ నున్నట్టు ప్రిన్సిపాల్ బోర బుచ్చిరాజు శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఐదో తరగతిలో ప్రవేశానికి ఉదయం 10 నుంచి 12 గంటల వరకు, ఇం టర్మీడ ియట్ ప్రథమ సంవత్సరంలో ప్రవేశానికి మధ్యాహ్నం 2 నుంచి 4.30 గంటల వరకు పరీక్ష జరుగుతుందన్నారు. ఆన్లైన్లో హాల్ టికెట్లను డౌన్లోడ్ చేసుకోవాలన్నారు.

## ఫోటో గ్రాఫర్ల సంక్షేమానికి కృషి

**విశాలాంధ్ర - ఎచ్చెర్ల :** ఫోటో గ్రాఫర్ల సంక్షేమానికి అవసరమైన కృషిచేస్తానని ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మెట్ట నాగరాజు అన్నారు. మండలం పొన్నాడలో మండల ఫోటోగ్రాఫర్ల సంఘ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఫోటో గ్రాఫర్ల వృత్తి ఎంతో బాధ్యత కలిగిందన్నారు. సెల్ఫోన్లు వచ్చిన తర్వాత ఫోటోగ్రాఫర్లకు కొంత ఇబ్బంది ఏర్పడిందన్నారు. ఈ సందర్భంగా ఫోటోగ్రాఫర్లకు గుర్తింపు కార్డులను అందజేశారు. ఈ కార్యక్రమంలో మండల ఫోటోగ్రాఫర్ల సంఘం అధ్యక్షుడు ఐవీ రమణ, ఉపాధ్యక్షులు కొండలరావు, కార్యదర్శి యు.దుర్గబాబు, పైడి బాలరాజు, సువ్వారి చిరంజీవి తదితరులు పాల్గొన్నారు.

## నేర నియంత్రణ అరికట్టే దిశగా పోలీస్ శాఖ చర్యలు

### సర్కిల్ ఇన్స్పెక్టర్ రామారావు

**విశాలాంధ్ర - మెలియపుట్టి :** శాంతిభద్రతల పరిరక్షణ, నేర నియంత్రణ, సంఘవిద్రోహ చర్యలను అరికట్టే దిశగా, పోలీస్ శాఖ కొన్ని కఠినమైన నిర్ణయాలు తీసుకోవడం జరిగిందని దీనికి అందరూ సహకరించాలని పాతపట్నం సర్కిల్ ఇన్స్పెక్టర్ రామారావు ఓ ప్రకటనలో తెలియజేశారు. టెక్కలి సబ్ డివిజన్ పరిధిలో టెక్కలి, కోటబొమ్మాళి, సంతబొమ్మాళి, నౌపడ, నందిగాం, నరసన్నపేట, జలుమూరు, పోలాకి, సారవకోట, పాతపట్నం, మెలియాపుట్టి, కొత్తూరు, హిరమండలం పోలీస్ స్టేషన్ల పరిధిలోని యావన్మంది ప్రజలకు శ్రీకాకుళం జిల్లా ఎస్పీ వారి ఆదేశాల మేరకు నేర నియంత్రణ కొరకు పోలీసులు రాత్రి సమయంలో ఖచ్చితమైన గస్తీ మరియు పెట్రోలింగ్ చేపడుతున్నారని, ఇకనుండి ఎటువంటి కారణాలు లేకుండా రాత్రి 11 గంటల తర్వాత తిరిగే వారిపై కేసులు నమోదు చేయడం జరుగుతుందని, ఒకవేళ ఏదైని తప్పనిసరి, ఎమర్జెన్సీ సమయాల్లో తగిన ఆధారాలతో మాత్రమే రాత్రిపూట బయటకు రాగలరని, పోలీసు వారిచ్చిన ఆదేశాలను తప్పక పాటించి పోలీసు వారికి సహకరించాలని ప్రకటన ద్వారా తెలియపరుస్తున్నారు.

## బాధిత కుటుంబానికి సీఎంఆర్ఎఫ్ చెక్కు పంపిణీ

**విశాలాంధ్ర - పొందూరు :** మండలం పిల్లలవలస గ్రామానికి చెందిన గురుగుబెల్లి లక్ష్మి కుటుంబానికి ప్రభుత్వం నుంచి వచ్చిన రూ ప్ 33 వేల చెక్కును ఎమ్మెల్యే కూన రవికుమార్ సతీమణి, మాజీ ఎంపిపి కూన ప్రమీల అందించా రు. ఇటీవల అనారోగ్యంతో ప్రవేటు ఆసుపత్రిలో శస్త్ర చికిత్స చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ బుడుమూరు పాలినాయుడు, ఉప సర్పంచ్ జి. కృష పాల్గొన్నారు.

## నాలుగు మండలాల్లో వైయస్సార్ యువ నేతల నియామకం

**విశాలాంధ్ర - జలుమూరు :** వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ పిలుపుమేరకు నరసన్నపేట నియోజకవర్గ పరిధిలో నాలుగు మండలాల్లో శు క్రవారం పార్టీ కార్యాలయం యువజన సంఘం అధ్యక్షులు పోలాకి జడ్పిటిసి ధర్మాన కృష్ణ చైతన్య ఆధ్వర్యంలో 4 మండలాల వైయస్సార్ యువ నేత ఎన్నిక కార్యక్రమం జరిగింది. జలుమూరు మండల వైఎస్ఆర్ పార్టీ యువజన అధ్యక్షులుగా జుత్తు నేతాజీ, సారవకోట మండల పార్టీ అధ్య క్షులుగా కొండాల బాబురావు, నరసన్నపేట మండల యువజన సంఘ అధ్యక్షులుగా బుద్దుల రాజశేఖర్, పోలాకి మండల పార్టీ అధ్యక్షులుగా రెంటి కోట త్రినాధరావు లు నియామకం జరిగింది. ఈ మేరకు ఆయా మండల పార్టీ అభిమానులు శుభాకాంక్షలు తెలిపారు. వారితోపాటు ప్రతి మండ లంలో ఉపాధ్యక్షులు కార్యదర్శులు సభ్యులను నియమించడం జరిగిందని పార్టీ వర్గాలు తెలిపాయి.

## వివాహిత హత్య కేసులో నలుగురు నిందితులు అరెస్ట్

**విశాలాంధ్ర - కవిటి :** మార్చి నెల 28వ తేదీన ఆర్ కరాపాడు గ్రామానికి చెందిన వివాహిత హత్య కేసులో నలుగురు ముద్దాయిలను అదుపులోకి తీసుకున్నట్లు కాశీబుగ్గ డి.ఎస్.పి వెంకట అప్పారావు తెలిపారు. ఈ మేరకు శుక్రవారం కవిటి పోలీస్ స్టేషన్ లో ఇచ్ఛాపురం సర్కిల్ ఇన్స్పెక్టర్ ఎం చిన్నం నాయుడు, ఎస్సై రవివర్మ లతో కలిసి విలేకరుల సమావేశం నిర్వహించి వివరాలు వెల్లడించారు. ఆర్.కరాపాడు గ్రామానికి చెందిన కొంతాల దిలీప్ కుమార్ అదే గ్రామానికి చెందిన రౌతు రెడ్ల మీనాక్షి కి 2020 జులై నెల 29వ తేదీన వివాహం జరిగిందని వారికి మూడు సంవత్సరాల వయసు కలిగిన కుమార్తె ఉన్నట్లు తెలిపారు. ఈ దంపతుల మధ్య సుమారు రెండు సంవత్సరాలు నుండి మీనాక్షి భర్త దిలీప్ కుమార్ మీనాక్షి నీ అనుమానిస్తూ మానసికంగా వేధిస్తున్నట్లు తెలిపారు. మీనాక్షి గర్భం దాల్చిన తర్వాత ఆ గర్భానికి తాను బాధ్యుడ్నికానని వేరే ఎవరితో అక్రమ సంబంధం వలన కలిగినదని మనసులో పెట్టుకొని మీనాక్షిని ఎలాగైనా చంపాలని నిర్ణయించుకొని ఒరిస్సా రాష్ట్రం కేసరపడ గ్రామానికి చెందిన మెట్టూరు రవి, విశాఖపట్నానికి చెందిన వనుము దాసు, జాడుపూడి ఆర్. యస్ కు చెందిన తోట భానుప్రసాద్ లను సంప్రదించి, వారి సహాయంతో ముందు వేసుకున్న పథకం ప్రకారం మార్చి నెల 28వ తేదీ సాయంకాలం దిలీప్ కుమార్ తన భార్య మీనాక్షిని సోంపేటలో వైద్యుడి వద్ద చూపించడానికి తీసుకువెళ్లి వైద్యునికి చూపించిన అనంతరం తిరిగి ఇంటికి మోటారు సైకిలు పై వస్తుండగా ఆర్ కరాపాడు రైల్వేగేటు దాటిన అనంతరం దారిలో కాపుకాచి తోట భానుప్రసాద్ తో ఇనుప రాడ్డుతో మీనాక్షి పై దాడి చేయించి ఆమె ను చంపించినట్లు వివరించారు. మీనాక్షి తల్లి రౌతురెడ్ల రాములమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు అనంతరం కొంతాల దిలీప్ కుమార్ తో పాటు మరో ముగ్గురిని శు క్రవారం సాయంత్రం ఇచ్ఛాపురం సర్కిల్ ఇన్స్పెక్టరు యమ్. చిన్నంనాయుడు ధనరాజు తులసమ్మ కొవెల వద్ద అదుపులోకి తీసుకున్నట్లు తెలిపారు. వారి వద్ద నుండి చంపడానికి ఉపయోగించిన ఇనుప రాడ్డు, రెండు మోటారు సైకిల్, ఒక బంగారు చైను మరియు 4 మొబైలు ఫోన్లను స్వాధీనం చేసుకున్నట్లు కాశీబుగ్గ డిఎస్పి వెంకట అప్పారావు తెలిపారు.

## రాష్ట్ర స్థాయి రెజ్లింగ్ పోటీలకు శివానీ విద్యార్థి

**విశాలాంధ్ర - ఎచ్చెర్ల :** శ్రీ శివానీ ఇంజనీరింగ్ కళాశాల (చిలకపాలెం)లో సీఎస్ఈ బ్రాంచ్‌లో తృతీయ సంవత్సరం చదువుతున్న విద్యార్థి ఎండ శివచరణ్ ఈ నెల 5, 6 తేదీల్లో రాజమండ్రిలో నిర్వహించిన రాష్ట్ర స్థాయి రెజ్లింగ్ (కుస్తీ) పోటీలకు ఎంపికయ్యాడు. ఇటీవల విజయనగరం జిల్లా కొండవెలగవాడలో నిర్వహించిన రెజ్లింగ్ పోటీల్లో పాల్గొని అండర్ -20, 72 కిలోల విభాగంలో రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యాడు. రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైన శివచరణ్ ను కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వై.శ్రీనివాసరావు, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ జీటీ చంద్రశేఖర్, యాజమాన్య ప్రతినిధులు అభినందించారు.

## శ్రీ చైతన్య అకాడమీ, ఇన్‌ఫినిటీ లెర్న్ 'ఆత్రేయ' ప్రారంభం

**విశాలాంధ్ర - విశాఖపట్నం :** ఇండియాలో ఫలితాల ఆధారిత అభ్యాసాన్ని పెద్ద ఎత్తున అందిస్తున్న ఏకైక హైబ్రిడ్ లెర్నింగ్ ప్లాట్‌ఫారమ్ ఇన్‌ఫినిటీ లెర్న్, శ్రీ చైతన్య అకాడమీ ఆధ్వర్యంలో ప్రత్యేక నీట్ కోర్సు 'ఆత్రేయ'ను ప్రారంభించాయి. ఇది డిజిటల్ టూల్స్‌తో పాటు రియల్ టైమ్ పనితీరు ట్రాకింగ్‌ను సమగ్రంగా అందిస్తుంది. నీట్ అభ్యర్థులకు ఎక్కువగా సవాలుగా నిలిచేది ఫిజిక్స్. దీనిపై ప్రత్యేకంగా దృష్టి పెడుతుంది. ఈ కోర్సులోని ప్రత్యేకత ఏమిటంటే, పీ2సీబీజెడ్ ద్వారా ఫిజిక్స్ సెషన్లను రెట్టింపు చేస్తుంది. విద్యార్థులలో కాన్సెప్ట్ బలాన్ని పెంచి నీట్ లో టాప్ ర్యాంకుల కోసం అవసరమైన శక్తిని అందిస్తుంది. గత దశాబ్దంలో శ్రీ చైతన్య అకాడమీ ఒక లక్షకు పైగా డాక్టర్లను తయారు చేసింది. ఏఐఐఎంఎస్ ఢిల్లీ లాంటి ప్రఖ్యాత వైద్య విద్యా సంస్థలలో చేర్పించడంలో కీలక పాత్ర పోషించింది. ఏఐఐఎంఎస్ ఢిల్లీలో 24 శాతం డాక్టర్లు ఈ అకాడమీ నుంచే ఉన్నారు. గత రెండు సంవత్సరాలలో నీట్ ఆల్ ఇండియా ర్యాంకులో ఒకటో ర్యాంకు సాధించిన విద్యార్థులు కూడా ఇక్కడ నుంచే వచ్చారు. శ్రీ చైతన్య అకాడమీ సుస్థిర బోధనా విధానంతో రూపొందించిన ఆత్రేయ 11వ తరగతి విద్యార్థుల కోసం ప్రత్యేకంగా రూపుదిద్దబడింది. ఆత్రేయలో విద్యార్థుల ప్రదర్శనను రియల్ టైమ్‌లో విశ్లేషణ జరుగుతుంది. విద్యార్థులు ఎదుర్కొంటున్న జ్ఞాన లోపాలను గుర్తించి, వారికి సరిపోయే కస్టమైజ్డ్ అభ్యాస పథకాలను సూచించడంలో టెక్నాలజీ ప్రధాన పాత్ర పోషిస్తుందనీ ఈ సందర్భంగా ఇన్‌ఫినిటీ లెర్న్ సహ వ్యవస్థాపకురాలు, శ్రీ చైతన్య గ్రూప్ సీఈఓ, డైరెక్టర్ సుష్మ బొప్పన, ఇన్‌ఫినిటీ లెర్న్ (శ్రీ చైతన్య) వ్యవస్థాపక సీఈఓ ఉజ్జ్వల్ సింగ్ తెలిపారు.

## రెండు కార్లు ఢీ

**విశాలాంధ్ర - ఎచ్చెర్ల :** మండలంలోని ఫరీదుపేట పంచాయతీ కొయ్యరాళ్ళ జంక్షన్కు సమీపంలో శుక్రవారం రెండు కార్లు ఢీకొన్నాయి. శ్రీకాకుళం నగరానికి చెందిన పి.నర్సింహమూర్తి కారు నడుపుకుంటూ శ్రీకాకుళం వైపు వెళ్తుండగా, వెనుక నుంచి వస్తున్న ఒడిసాకు చెం దిన కారు ఢీకొంది. ఈ సంఘటనలో ముందు వెళ్తున్న కారులో ఉన్న బాలికకు గాయాలయ్యాయి. ఈ మేరకు ఎచ్చెర్ల పోలీసులకు ఫిర్యాదు అందింది.

## పెంటమాంబ ఉత్సవాలకు పోలీస్ శాఖను అనుమతి కోరిన ఆలయ కమిటీ సభ్యులు

**విశాలాంధ్ర - పెదగంట్యాద :** శ్రీ పెంటమాంబ పండుగ ఉత్సవాల్లో భాగంగా ఈ నెల పదిహేనో తేదీ వరకు జరగబోవు సాంస్కృతిక కార్యక్రమలకు, సాంఘిక నాటకాలు, సంగీత విభావారి మొదలగు కార్యక్రమలకు అనుమతి ఇవ్వాలి అని న్యూపోర్ట్ సీఐ టి కామేశ్వర రావు ను నెల్లిమక్కు గ్రామ పెద్దలు, ఉత్సవ కమిటీ సభ్యులు కోరారు, ఈ సందర్భంగా సిఐ కామేశ్వర రావు మాట్లాడుతు ఉత్సవ కమిటీ సభ్యులు ప్రశాంతమైన వాతావరణం లో పండుగ జరు పుకోవాలని , భక్తులకు అన్ని రకాల సదుపాయాలు ఏర్పాటు చేసుకోవాలని రెండు రోజుల్లో ఆలయ పరిసరాలను పరిశీలించి బందోబస్త్ ఏర్పాటు చేస్తామన్నారు. సి ఐ ను కలిసిన వారిలో లో పులి వెంకట రమణారెడ్డి, గోందేశీ అప్పలరెడ్డి, సత్యారావు, యేల్లేటి శ్రీనివాసరావు, మొల్లి వెంకటరమణ, పిట్ట కుంచరావు తదితరులు ఉన్నారు.

## బీజేపీ ఆవిర్భావ దినోత్సవ వేడుకలకు సమీక్షా సమావేశం

**విశాలాంధ్ర - ఆనందపురం :** ఆనందపురం మండల ంలో వెల్లంకి బిజేపి పార్టీ కార్యాలయంలో బిజెపి మండల అధ్యక్షురాలు పిల్లా విజయ ఆధ్వర్యంలో మండల కమిటీ సమావేశం నిర్వహించడం జరిగింది కార్యక్రమానికి ముఖ్య అతిథిలుగా,ఇన్చార్జిలుగా బిజేపి సీనియర్ నాయకులు కె.యస్.పి. చక్రవర్తి ,శ్రీ వేదుల దక్షిణామూర్తి .విశాఖ జిల్లా కిసాన్ మోర్చా అధ్యక్షులు పి.వి.వి. ప్రసాదరావు పట్నాయక్ రాష్ట్ర కౌన్సిల్ మెంబర్ ఉప్పాడ అప్పారావు భీమిలి నియోజకవర్గం కన్వీనర్ కే.రామ నాయుడు,బిజేపి మాజీ మండల అధ్యక్షులు మీసాల రాము నాయుడు ఈ సమావేశంలో పాల్గొని భారతీయ జనతా పార్టీ కార్యకర్తలకు ఈ నెల 6 తేదీన జరగబోవు భారతీయ జనతా పార్టీ ఆవిర్భావ దినోత్సవం వేడుకలకు ఆనందపురం మండలంలో ప్రతి గ్రామంలో కార్యకర్తలు భారతీయ జనతా పార్టీ జెండా ఎగరవేయాలని సూచించారు,అలాగే ఈనెల 14వ తేదీన డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ జయంతి ఉత్సవాలు ఘనంగా నిర్వహించాకానీ సూచించారు. ఈ కార్యక్రమంలో భాగంగా భారతీయ జనతా పార్టీ మండల కమిటీని, మోర్చ అధ్యక్షులను నియమించడం జరిగింది.

వాటి వివరాలు: మండల ప్రధాన కార్యదర్శులు(1) దంగేటి పెంట జోగ శివ వెంకట రత్నం గొట్టి పల్లి)
(2) పోతిన జీవన సంతోష్ (పెద్దిపాలెం)

ఆనందపురం మండలం మోర్చ అధ్యక్షులు :

(1) ఇల్లిపిల్లి వెంకట రావు వర్షం వెంకట్)లి ఓబీసీ మోర్చ మండల అధ్యక్షులు.
(2) దంతులూరి వెంకట సుబ్బ భాస్కర్ వర్మ, యువ మోర్చ మండల అధ్యక్షులు
(3) సీపాన సరిత మహిళ మోర్చ అధ్యక్షురాలు
(4) కర్రోతు సత్యం:- కిసాన్ మోర్చ మండల అధ్యక్షులు
(5) మల్లారపు కృష్ణ ఎస్సీ మోర్చ మండల అధ్యక్షులు
(6) మొహమ్మద్ ఈర్షాద్ ఆలీ:- మైనారిటీ మోర్చ మండల అధ్యక్షులు తదితరులు పాల్గొన్నారు.